AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 4,Issue: 13 October - 2007

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)



## డబ్బు... డబ్బు... డబ్బు

## సుబ్‌హానల్లాహ్‌ !

## పరిశుభ్రతకు మరో పేరు ఇస్లాం

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

NELAVANKA
(Al-Hilal)
Monthly

CHIEF PATRON
Muhd. Ismail Al-Ansari

CHIEF EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Shaikh Abdus Salam Omeri
Tahera Begum

Graphic Designer
Noushad Zainulabdeen

PUBLISHED BY
Islam Presentation committee
Kuwait

PHONES
2444116 , 2444117
Extns :
110 Azeezur Rahman
106 Mujahid khan Omeri

FAX
2400057

EMAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O. Box-1613
Safat-13017, KUWAIT

# నెలవంక



4-5



9



14-15




17

## ఈ సంచికలో.... | الفهرس


| | | |
|---|---|---|
| వివేచనను విడనాడకండి | 2 | التزموا الحكمة |
| ఒరేయ్ చంటీ ! | 3 | نصيحة لقمان عليه السلام لابنه |
| దేవుడున్నాడండీ..! | 4 | وجود الله ووحدانيته بدلائل عقلية والنقلية |
| డబ్బు.. డబ్బు.. డబ్బు | 6 | إنما أموالكم وأولادكم فتنة |
| నఫిల్ ఉపవాసాలు | 7 | صيام التطوع |
| కళంకం | 8 | ماالقصد بحرية المرأة (نشيدة) |
| పవిత్ర జీవితం | 9 | إسلام عمر رضي الله عنه (تلخيص الرحيق المختوم) |
| విశ్వాసుల మాత (ఉమ్మె సల్మా (ర. అన్హా) | 10 | سيرة السيدة أم سلمى (رضي الله عنها) أمهات الخالدات |
| దైవ మార్గంలో ఖర్చు పెట్టండి ... | | أنفقوا في سبيل الله |
| సౌభాగ్యానికి సోపానం | 11 | الوسيلة المفيدة للحياة السعيدة |
| ఇస్లాం శిక్షణ | 12 | تربية المهتدين |
| సుబ్‌హానల్లాహ్ ! | 13 | سبحان الله عما يشركون |
| దివ్య ఖుర్‌ఆన్.... మహదానుగ్రహం | 15 | القرآن هو شفاء ورحمة للعالمين |
| ఐ.పి.సి వార్తలు | 17 | أخبار اللجنة |
| పరిశుభ్రతకు మరో పేరు ఇస్లాం | 18 | النظافة في الإسلام (بقلم صحافي الهندي) |

PAGE 1-20.pdf 10/7/07 8:56:21 PM



# నెలవంక ఉత్తరాలు



## ఇది మన బాధ్యత

ప్రధాన సంపాదకులకు,

జీవనోపాధి కోసం కువైట్‌కి వచ్చి విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ వ్యభిచారానికి, అశ్లీలానికి వడిగడుతున్న వారిలో మన తెలుగువారి పాత్ర పైచేయిగానే ఉంది. ఇందులో పురుషుల కంటే స్త్రీల సంఖ్య ఎక్కువ అని పిస్తుంది. అలాంటి వారికి 'దృక్పథం' లో హెచ్చరికగా వివరించిన విధానం చక్కగా వుంది. ఇది ఒక ముస్లింగా బాధ్యత కూడా. " దేశమును ప్రేమించు మన్న, మంచి అన్నది పెంచుమన్న " అనే వ్యాసం ఆలోచింపదగ్గదిగా ఉంది. ఇంకా 6 పదుల అతి పెద్ద ప్రజాస్వామిక దేశం అంటూ మన దేశ స్వాతంత్ర్య దినోత్సవం గురించి ఇవ్వడం సంతోషదాయకం. అంతేకాకుండా కొత్తగా ప్రారంభమైన ఇస్లాం శిక్షణ, చెప్పుకోండి చూద్దాం, సీరత్ క్విజ్ లాంటి చిరు వ్యాసాలతో రోజు రోజుకు ఓ కొత్త రూపాన్ని రూపు దిద్దు కుంటున్న ఈ నెలవంక వాస్తవంగానే మెదడుకు మేత, హృదయాలకు ఓ బాట. అల్ హమ్దులిల్లాహ్. **నెలవంక** చైతన్య రథ సారథులందరికీ నా కృత జ్ఞతలు.

– మర్యమ్ జానకి (రౌదా)

## కనువిప్పు కలిగించారు

గౌరవనీయులైన నెలవంక సంపాదకులకు,

జూలై నెలలో ప్రచురించిన 'ఇది నిర్మాణమా విచ్ఛిన్నమా?' చాలా బాగుంది. లేత వయస్సులో వున్న చిన్నారులకు లైంగిక సంబంధాల గురించి పాఠాలు చెప్పితే వారి భవిష్యత్తు పెడదారి పడుతుంది. ఉపాధ్యాయులపట్ల బాల బాలికలకు వుండవలసిన గురుభక్తి, పవిత్రబంధం కలుషితం అవుతుంది. అలాగే ఆగస్టు నెలలో **నెలవంక** చాలా బాగా వున్నది. అందులో "ఈ నమ్మకం వమ్ముకారాదు" "ఎవరు వీరు" పైలం కొడుకో?, ఉమ్రా యాత్ర, వలీమా ఫంక్షన్ చాలా బాగా వున్నవి. ముఖ్యంగా 2, 3, 19 పేజీలు మాత్రం చాలా అద్భుతంగా కనువిప్పుగా ఉన్నాయి. అజీజుర్రహ్మాన్ గారు చెప్పినట్లుగా ఇక్కడ నిజంగా జరుగుతోంది.

– యమ్. రమేష్ బాబు (అబ్దుల్ రహ్మాన్)
సబాహ్ సాలెమ్

## నెలవంక తన బాధ్యతను నిర్వర్తించింది

ముఖ్యంగా నీటిని గురించి: నీటికోసం జనులు ఉద్యమాలు చేపడు తున్నారు. ఇదే నీటికోసం ఒకే దేశంలోని రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలోని జిల్లాల మధ్య విద్వేషం పెరుగుతోంది. శత్రుత్వం ఏర్పడుతోంది. భూగర్భజలాల్లోని నీరు తగ్గిపోతోందని శాస్త్రవేత్తలంటున్నారు. రాబోవు కాలంలో నీరు ఇంకా తగ్గే అవకాశాలున్నాయంటున్నారు. కాని చాలా మంది నీటిని వృథా చేస్తున్నారు. దివ్య ఖురాను ఆయతు ద్వారా నీటి యొక్క విలువను, నీటిని ఆదా చేయవలసిన అవసరాన్ని **నెలవంక** ద్వారా తమ బాధ్యతగా తెలియజేసినారు.

"అవధుల్లేని ప్రేమ" లో జైనుల్ ఆబిదీన్ (రహ్మ) గారి దాన ధర్మాల గురించి తెలిపి మాలో కూడా అటువంటి భావాలను రేకెత్తించిన అబుల్ హసన్ గారికి కృతజ్ఞతలు. "అదిగో అతడే విశ్వాసి" లో అల్లాహ్ యొక్క అసలు సిసలైన దాసుల లక్షణాలను తెలిపిన గురువులు అజీజుర్రహ్మాన్ గారికి ధన్యవాదాలు.

"**నెలవంక**" నెల నెలా కొత్త కొత్త వెలుగు, జిలుగులతో – ఆలోచ నాత్మకమైన, ఆచరణాత్మకమైన, సందేశాత్మకమైన వ్యాసాలతో మా ముందుకొస్తోంది.

– షేఖ్ రియాజ్
(కువైట్)

## మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న నెలవంక

మూడు రంగుల జాతీయ పతాకం అరవై వసంతాలుగా "సారే జహా సె అచ్ఛా" "దేశమును ప్రేమించుమన్నా! మంచి అన్నది పెంచుమన్నా!" అంటూ, "మన నిండు గౌరవాన్ని నిలుపుకుందాం" అన్న నినాదంతో వెలువడిన ఆగస్టు సంచిక కడు పసందుగా ఉంది. "పురివిప్పిన పౌరు షంతో" "రండి! న్యాయాన్ని స్థాపిద్దాం!" అని ఎలుగెత్తి పిలుస్తూ "పై చేయి క్రింది చేయికన్నా మేలైనదన్న" "ఇస్లాం శిక్షణ" లో " ఈ నమ్మకం వమ్ము కారాదు " " పైలం కొడుకో! " అని చెబుతూ "ఎవరు వీరు!" అని జాగరూక పరిచారు. అలాగే నవ ముస్లింల వివాహబంధానికి ప్రోత్సాహ కరంగా ఐ. పి. సి. వారు 'వలీమా' ఏర్పాటు చేయడం ఎంతో ముదావ హం!

– యమ్. డి.అమీన్
(ఫహాహీల్)

## నేను కూడా దైవ మార్గంలో ప్రాణాలు అర్పించాలి

నెలవంక ఎప్పుడు వస్తుందా అని ఎంతో ఆశతో ఎదురు చూస్తూ వుంటాము. ఆగస్టు నెలలో వచ్చిన "ఎవరు వీరు?" అబూ అతీఖ్ గారి వ్యాసం చాలా బాగ నచ్చింది. ఆ వ్యాసం మనందరికీ హెచ్చరిక లాంటిది. సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ గారు వ్రాసిన "పురి విప్పిన పౌరుషం" లో సహాబీలు దైవ మార్గంలో ప్రాణాలు అర్పించారు అని చాలా బాగా వ్రాసారు. నాకు ఇప్పుడు అనిపిస్తోంది – నేను కూడా దైవ మార్గంలో ప్రాణాలు అర్పించాలని.

జైలులో ఇస్లాం స్వీకరిస్తున్న వారికి అల్లాహ్ విముక్తి కలిగించాలని "దుఆ" చేస్తున్నాను. నెలవంకలో ఇంకా ఎన్నో మంచి మంచి వ్యాసాలు రావాలని మనసారా కాంక్షిస్తున్నాను.

– ఈమాన్ (ఫహాహీల్),

# ఒరేయ్ చంటీ !

– అబూ హామిద్

## నా ముద్దుల కన్నా !

నేను ఎల్లప్పుడూ నీ మేలే కోరుతూ వచ్చాను. నీవు కలకాలం ఆనందంగా, సుఖంగా, సురక్షితంగా, సగౌరవంగా ఉండాలన్నదే నా ప్రబల వాంఛ. నీవు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సాఫల్యాన్ని పొందాలని, అల్లాహ్ నిన్ను మెచ్చుకోవాలని, మరణానంతర జీవితంలో సజ్జనులైన అల్లాహ్ దాసులతోపాటు స్వర్గంలో నువ్వూ ప్రవేశించాలన్నదే నా బలమైన కోరిక. అందుకే నేను నీకు కొన్ని హితబోధనలు చేస్తున్నాను. తప్పకుండా ఆచరిస్తావని ఆశిస్తున్నాను. అల్లాహ్ నీకు సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## నాయనా !

సకల లోకాలకు నిర్మాత, యజమాని, ప్రభువు అల్లాహ్ మాత్రమే. ఆయనకు సృష్టితాలలో ఎవరినీ భాగస్వాములుగా చేర్చకు. ఆయన్ను కాదని ఎవరి ముందూ తలవంచకు. చెయ్యి చాచి ఎవరినీ అర్థించకు. నీకు లాభనష్టాలు కలిగించే అధికారం సృష్టిలో ఏ శక్తికీ లేదని గట్టిగా నమ్ము. సృష్టితాల పూజ అన్యాయం. క్షమించరాని నేరం. జాగ్రత్త! అల్లాహ్‌తోపాటు మరొకరిని ఆరాధ్యునిగా చేసుకోకు. అలా చేస్తే నిందల పాలవుతావు. ప్రతి మేలుకూ దూరమవుతావు. మరణానంతరం నరకంలో వేయబడతావు.

## నా ముద్దుల బాబూ !

నమాజును స్థాపించు. నమాజుల పట్ల ఎన్నడూ అశ్రద్ధ వహించకు. నమాజు వాస్తవానికి నీ ప్రభువుకు నీవు చేసే దాస్యానికి నిదర్శనం. నీ శీలనిర్మాణంలో నమాజు ఎంతో తోడ్పడుతుంది. అశ్లీల కార్యాల నుండి, సిగ్గుమాలిన పనుల నుండి నిన్ను వారిస్తుంది. నువ్వు నమాజులో నీ ప్రభువును స్తుతిస్తావు. రుజుమార్గం చూపించమని వేడుకుంటావు. ఆయన సహాయాన్ని అర్థిస్తావు. నమాజు తీర్పు దినాన నీ ప్రభువు న్యాయస్థానంలో నీ చేష్టలకు బదులు చెప్పుకోవాలన్న బాధ్యతను జ్ఞాపకం చేస్తుంది.

నమాజు నీ వెంట నీ ప్రభువు ఉన్నాడన్న ధైర్యం కలిగింపజేస్తుంది. నమాజుకు విముఖత చూపినవాడు మనశ్శాంతికి నోచుకోడు.

## నా ముద్దుల కుమారుడా !

సత్కార్యాలను గురించి ఆజ్ఞాపించు. ఆజ్ఞాపించడమే కాదు సత్కార్యాలను ప్రేమించు. సత్కార్యాలను ప్రోత్సహించు. సత్కార్యాలను పెంచు. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టడమూ సత్కార్యమే. అనాథకి ఆశ్రయమివ్వడమూ సత్కార్యమే. వితంతువులను ఆదరించడమూ సత్కార్యమే. నిరుపేదలను ఆదుకోవడమూ సత్కార్యమే. పీడితులను సమర్థించటమూ సత్కార్యమే. రోగులను పరామర్శించడమూ సత్కార్యమే. న్యాయం కోసం పాటుపడటమూ సత్కార్యమే. దారి తప్పిన వారికి సన్మార్గం చూపించడమూ సత్కార్యమే. జనులను సృష్టికర్త వైపు ఆహ్వానించడమూ సత్కార్యమే.

దుష్కార్యాల నుండి జనుల్ని నిరోధించు. కేవలం నిరోధించడమే కాదు, నువ్వు స్వయంగా దుష్కార్యాలకు దూరంగా ఉండు. వాటిని అసహ్యించుకో. విగ్రహారాధన కూడా దుష్కార్యమే. వడ్డీ తినడం కూడా దుష్కార్యమే. మద్యపానం కూడా దుష్కార్యమే. కొలతల్లో, తూనికల్లో మోసం చేయడం కూడా దుష్కార్యమే. జూదమాడటం కూడా దుష్కార్యమే. వ్యభిచారం కూడా దుష్కార్యమే. ఈ దుష్కార్యాలు కాపురాలను కూల్చేస్తాయి. సమాజాన్ని సర్వనాశనం చేస్తాయి. కనుక వీటిని రూపుమాపడానికి నడుం బిగించు.

## ఒరేయ్ చంటీ !

జనుల పట్ల ఉత్తమంగా మసలుకో. వారిని ఆప్యాయంగా పలకరించు. పెద్దలను గౌరవించు. పిన్నలపై వాత్సల్యం కురిపించు. ఎవరితోనూ ముఖం చాటేసుకోకు. భూమిపై నిక్కుతూ నడవకు. ఎవరినీ అంటరానివానిగా భావించకు. ఎవరి ముందూ నీ వంశం గురించి, నీ ఆస్తి అంతస్తులను గురించి గొప్పలు చెప్పుకోకు.

ఎదుటి వ్యక్తిని కించ పరచకు. గర్విష్టిని, బడాయికోరును అల్లాహ్ ప్రేమించడు.

అనవసరంగా మాట్లాడకు. మాట్లాడేటప్పుడు నీ స్వరంలో కూడా గంభీరత, పెద్దరికం ఉట్టిపడాలి. ఇంట్లోగాని, బజారులోగాని అనవసరంగా కేకలు పెట్టకు. కంఠస్వరాన్ని పెంచకు. నా ఈ బోధనలను పాటిస్తే తరువాత తరాల వారిలో నీకు మంచి పేరు ఉంటుంది. పరలోకంలో సుఖసౌభాగ్యాల స్వర్గవనాలకు వారసుడవుతావు.

**(గమనిక : సూరయె లుఖ్మాన్‌లోని లుఖ్మాన్ హిత బోధ వెలుగులో)**



PAGE 2-3.pdf 10/7/07 8:59:35 PM

దృక్పథం



# వివేచనను విడనాడకండి


بسم الله الرحمن الرحيم

**శుభాల** సరోవరమైన రమజాను మాసం అనంతమైన తన వరప్రసాదాలను మనపై కురిపించి, మన నుండి సెలవు తీసుకుంటోంది. సజ్జనులైన దైవ భక్తులు ఈ మాసం విధించిన ఆంక్షలను మనస్ఫూర్తిగా శిరసావహిస్తూ గొప్ప పుణ్యఫలాన్ని మూటగట్టుకున్నారు. నిష్కల్మషమైన విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో నెల రోజుల ఉపవాస వ్రతాలను పాటించి తరించినవారు నిజంగానే ధన్యులు.

ఎందుకంటే వారు పూర్తి ఏకాగ్రతతో తమ ప్రభువు మీదే మనసును లగ్నం చేసి ఆరాధనలు చేశారు. చిత్తశుద్ధితో తమ స్వామి సన్నిధిలో శ్రద్ధాభక్తుల నివాళి ఘటించారు. దివ్య గ్రంథాన్ని భక్తితో పరవశిస్తూ పారాయణం చేశారు. రాత్రి పూట తియ్యని నిద్రను త్యజించి దైవ ధ్యానంలో నిలబడ్డారు. సిగ్గుతో కుంచించుకుపోతూ అశ్రుపూరిత నయనాలతో వేడుకున్నారు. తమ తాహతుకు తగ్గట్టుగా దాన ధర్మాలు చేశారు. సమాజంలోని అభాగ్యజీవులకు చేయూతనిచ్చి నిలిపే సంక్షేమ పథకాలలో పాల్గొన్నారు. తన సజ్జన దాసుల ఈ ఉపాసనా రీతులను కారుణ్య ప్రభువు దయతో సమ్మతించి ఆమోదించుగాక! మరుపు వల్ల జరిగిన వారి తప్పులను మన్నించి, నరకాగ్ని నుండి వారికి విముక్తిని వొసగుగాక! రమజాను పండుగ సందర్భంగా వారికి కలిగిన ఆనందానుభూతిని వారి జీవితాల్లో నిత్యం కళ కళలాడేలా నిలిపి ఉంచుగాక! ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వారు ఈ మాసంలో సాధించిన సాత్వికతను, దైవవిధేయతా గుణాన్ని, పరలోక భావాన్ని దేవుడు స్థిరంగా ఉంచుగాక! (ఆమీన్)

మహత్పూర్వకమైన ఈ మాసంలో ఎంతో మంది పుణ్య పురుషుల మధ్యన గడిపే అవకాశం మనకు లభించింది. ఉపవాసకులపై వారు కురిపించిన మమతానురాగాలను, కొత్తగా సన్మార్గ భాగ్యాన్ని ఆస్వాదించిన సోదర సోదరీమణుల పట్ల వారు కనబరచిన వాత్సల్యాన్ని కూడా మనం మన చర్మ చక్షువులతో వీక్షించాము. పగలంతా ఉపవాస స్థితిలో మండుటెండలో మాడిపోతూ పరిశ్రమించి, సాయంత్రం ఉపవాస విరమణ కోసం మస్జిదుల వైపు వచ్చే శ్రామికులను హృదయానికి హత్తుకుని, ఆప్యాయతతో అన్నం పెట్టిన అపురూప దృశ్యాలను కూడా కువైట్‌లో మనం తిలకించాము. కలవారిలో కలిగిన ఈ సేవా భావన ముమ్మాటికీ కొనియాడదగినది. ఇది మనందరికీ స్ఫూర్తిదాయకం కావాలి. ఈ సౌహార్ద వాతావరణం రమజానేతర నెలల్లో కూడా వెల్లి విరియాలని కోరుకుందాం.

కాని నేటి ముస్లిం సమాజ చిత్ర పటాన్ని నిశిత దృష్టితో చూసినప్పుడు ఈ 'మంచి' చాలా తక్కువగా – పిండిలో ఉప్పు మాదిరిగా – కానవస్తుంది. ధర్మ సంస్థాపనార్థం మానవ కోటిలోనుంచి ఎన్నుకోబడి మంచిని పెంచడానికి, చెడులను రూపుమాపడానికి విశ్వ ప్రభువు తరఫున నియుక్తమైన ఈ "శ్రేష్ఠ సమాజం" నేడు ఒక వైపు తీవ్రమైన భావ దారిద్ర్యంతో సతమతమవుతుంటే, ప్రతి చిన్న విషయానికి ఆగ్రహంతో రెచ్చిపోయే మనవాళ్ళ తత్వం మరోవైపు ఎన్నో అనర్థాలను తెచ్చి పెడుతోంది. నేడు మన వారిలో లోపించిన నిగ్రహం, సానుభూతి, క్రమశిక్షణను చూసి లోకం ఇస్లాంపై వేలెత్తుతోంది. నిజానికి లోపం ఇస్లాంలో లేదు, లోపం మనలో ఉంది. ఇస్లాం ఇచ్చిన అత్యుత్తమ శిక్షణా కోర్సు ప్రకారం నేడు మనం జీవితం గడుపుతూ ప్రపంచానికి శాంతీ సౌమనస్యాల సందేశం క్రియాత్మకంగా ఇవ్వగలిగితే ఎంత బావుండు! "సహనం, నమాజు ద్వారా (అల్లాహ్) సహాయం అర్థించండి. నిశ్చయంగా అల్లాహ్ సహన శీలురకు అండగా ఉంటాడ"న్న దైవోపదేశాన్ని ఆశ్రయించటం వినా మనకు మార్గాంతరం లేదు సుమా!



*"ఓ మానవుడా! దయాకరుడైన, కరుణా సాగరుడైన నీ ప్రభువుని గురించి నిన్నే విషయం మోసంలో పడేసింది? ఆయనే కదా నిన్ను పుట్టించి, నిన్ను తీర్చిదిద్దాడు, నిన్ను తగిన విధంగా రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను [అందంగా] మలిచాడు."*


*[ఇన్ఫితార్: 6-8]*

ఓ సందర్భాన ఒక నాస్తికుడు ఇమామ్ షాఫయి (రహ్మ) గారినిలా ప్రశ్నించాడు: 'దేవుడున్నాడని నిరూపించగలిగే ఏ ఆధారమైనా మీ వద్ద ఉందా?'అని. అందుకాయన సమాధానమిస్తూ-మల్బరి ఆకు రుచి రంగూ ఒకే విధంగా ఉంటుంది.కానీ దాన్ని పట్టు పురుగు తింటే పట్టు వస్తుంది. తేనేటీగ తింటే తేనే లభిస్తుంది. మేక తింటే పాలిస్తుంది. లేడి తింటే కస్తూరి ఉత్పన్నమ వుతుంది. అలా ఒక్క మల్బరి ఆకు ద్వారా ఇన్ని విధాల వస్తువులు ఎవరు సృష్టించగలరు? ఈ కార్యం - ఆ చెట్లని, ఈ పురుగుని, ఈగను, మేకను సృజించిన ఆ ఒక్క సృజన కారుడికే సాధ్యం సుమా!" అన్నారు.

జ్ఞాన వివేకాలు గల ఏ వ్యక్తి అయినా సరే మానవ జీవితంలో అడుగడుగునా దర్శనమిచ్చే ఇటువంటి భిన్నత్వాల గురించి గనక ఆలోచిస్తే ఖచ్చితంగా తను సత్యాన్ని చేరుకోగలడు. కనుక మనలోని ప్రతి ఒక్కరూ తన ఉనికిని గురించి, తన శరీర నిర్మాణం గురించి, తన కోసం ఉనికిలోకి తేబడిన ఈ సృష్టి బ్రహ్మాండం గురించి ఆలోచించాలి. తర్కించి పరిశోధించి చూడాలి.

మానవ శరీరమనే ఈ రక్త మాంసాల ముద్ద సైతం ఎవరి అధీనంలో ఉంది? తనవారి విషయంలోగానీ, పరాయివారి విషయంలోగానీ, ఇతర జీవరాసుల విషయంలోగానీ మనిషికి ఎటువంటి అధికారమైనా ఉందా? లేదు అంటే ఎందుకు ఈ మిడిసిపాటు? ఇదే ప్రశ్న ఖుర్‌ఆన్ సైతం మనిషికి వేస్తోంది...: 'ఓ మానవుడా! దయాకరుడైన, కరుణా సాగరుడైన నీ ప్రభువుని గురించి నిన్నే విషయం మోసంలో పడేసింది? ఆయనే కదా నిన్ను పుట్టించి, నిన్ను తీర్చిదిద్దాడు. నిన్ను తగిన విధంగా రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను (అందంగా) మలిచాడు."

(ఇన్ఫితార్: 6-8)




"ఆయనే కదా (మాతృగర్భాల్లో) మీ రూపు రేఖల్ని తాను తలచిన విధంగా రూపొందించింది."

(ఆలి ఇమ్రాన్: 5)

"ఆయనే కదా మీ కోసం నేలను పాన్పు గాను, నింగిని కప్పుగాను చేశాడు. పైనుంచి వర్షాన్ని కురిపించేవాడు కూడా ఆయనే. ఆ వర్షం ద్వారా ఆయన రకరకాల పండ్లూ, పంటలు పండించి మీకు ఉపాధిని అనుగ్రహిస్తున్నాడు."

(బఖర: 22)

"ఏమిటి? నిన్ను మట్టితో, వీర్య బిందువుతో సృజించి పరిపూర్ణ మానవుడిగా రూపొం దించిన ఆ (అపూర్వ) సృజనకారు డినే తిరస్కరిస్తున్నావా?"

(కహఫ్: 37)



PAGE 4-5.pdf 10/7/07 9:00:49 PM

# దేవుడున్నాడండీ.....!

- శాంతి ప్రియ

మానవుడు వైజ్ఞానికంగా గొప్ప అభివృద్ధిని సాధించాడు. నక్షత్రాలకు, అంతరిక్షంలోని అనేక గ్రహాంతరాలకు నిచ్చెన వేస్తున్నాడు. వాతావరణాన్ని, అపరిచిత సుపరిచిత ప్రాంతాలను తన కైవసం చేసుకునేందుకు ఉరకలేస్తున్నాడు. సముద్ర గర్భంలో సొర చేపవలే ఈదగలుగుతున్నాడు. సమాచార ప్రసారానికి అతివేగమైన పరికరాలను కనుగొని పూర్తి జగత్తునే ఓ గ్రామంగా మార్చగలిగాడు. ఇంత గొప్ప ప్రగతిని సాధించినప్పటికీ ఖుర్ఆన్ పేర్కొన్నట్టు ఒక్క ఈగను కూడా అతను సృష్టించలేడు. సృష్టించడం అతని తరం కాదు కూడా.

మానవుడు తన ఉనికి ఉద్దేశాన్ని మరచి, సృష్టి వెనుక దాగివున్న మర్మాన్ని విస్మరించి ఏమరుపాటుకి గురై జీవిస్తున్నాడు. ఎటువంటి సొంత ప్రమేయం, సంకల్పం, అధికారం లేకుండా అకస్మాత్తుగా భూమి అనబడే ఈ అపరిచిత ప్రాంతానికి తేబడ్డాడు. తల్లి గర్భంలో మూడేసి చీకటి పొరలలో రక్తం మరియు నీటి మధ్య కొట్టు మిట్టాడుతున్నప్పుడు ఈ లోకం గురించి గానీ, లోకంలోని సృష్టితాల గురించిగానీ బొత్తిగా తెలియదు అతనికి. అలా ఈ అవనిపై కాలు పెట్టిన మనిషి ఇక్కడ తనకు అవసరమైన ప్రతీది ఎంతో పొందికగా అందంగా అమర్చబడి ఉండటాన్ని చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఓ అపరిచిత ప్రాంతానికి చేరుకున్న ఈ మనిషి తన ప్రమేయం లేకుండా అకస్మాత్తుగా ఆ ప్రాంతానికి తీసుకొచ్చి, తనకు కావాల్సిన వాటన్నిటినీ సమకూర్చిపెట్టిన ఆ సృష్టికర్త గురించి తెలుసుకునేబదులు, తన ఉనికికి గల ఉద్దేశాన్ని గ్రహించడానికి బదులు సృష్టి రహస్యాలు తెలుసుకోవాలన్న ఆత్రుతతో సృష్టికర్తనే మరిచాడు. అంతేకాదు, స్వయంగా సృష్టికర్తతో, ఆయన ఉనికిని చాటే ప్రవక్తలతో వాదోపవాదాలకి దిగాడు. సృష్టిని, సృష్టిలో జరిగే ప్రతి చిన్నా పెద్ద సంఘటనకు నేచర్ అన్న అందమైన పేరు కూడా ఇచ్చాడు. నేచర్ (ప్రకృతి) ఉందని విశ్వసించిన తను ఆ ప్రకృతి కూడా ఓ బలాఢ్యుడి అదుపాజ్ఞలకు లోబడి ఉందన్న సత్యాన్ని మాత్రం ఉపేక్షించాడు. వెలుగు, కాంతి, కిరణాలు, లేజర్స్ గురించి అనేక విషయాలను గ్రహించిన ఈ మనిషి, ఈ భూమ్యాకాశాలను వెలుగులతో నింపిన ఆ అఖండ జ్యోతీశ్వరుణ్ణి మాత్రం గ్రహించలేక పోతున్నాడు. కారణం తను ఆ దిశగా ఆలోచించలేదు. పరిశోధించలేదు. ఒక వేళ అతను ఆదిశగా పురోగమించివుంటే నేడు అతని పూర్తి దశే మారిపోయి ఉండేది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి అతని విషయంలో సత్యమయ్యేది: "మీలో (సత్యాన్ని) విశ్వసించి జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత హోదాలు ప్రసాదిస్తాడు."

(ముజాదలా:11)

ఇక వివేకవంతుడైన ప్రతి వ్యక్తీ ఈ లోకం నుండి, అందులోని మానవుని జీవితం నుండి అనేక పాఠాలు నేర్చుకోగలడు. అద్భుతమైన ఈ సృష్టి ఎన్నో హంగులతో అలరారుతోంది. ఓ వ్యక్తి పొట్టిగా ఉంటే, మరో వ్యక్తి పొడుగ్గా ఉన్నాడు. ఒకడు తెల్లగా మరొకడు నల్లగా అగుపిస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్ని వ్యత్యాసాలో! అలా ప్రతి ఒక్క జీవి రూపు రేఖలు, స్వభావాలు, అభిరుచులు వేర్వేరుగా ఉంటాయి.



# నఫిల్ ఉపవాసాలు

**(1) ఆషూరా రోజు ఉపవాసం :** ముహర్రమ్ నెల పదో తేదీన మరియు అంతకు ముందు ఒక రోజు అంటే తొమ్మిదో తేదీన (రెండు రోజులు) ఆషూరా సంకల్పంతో ఉపవాసాలు పాటించటం.
"ఎవరైతే ముహర్రమ్ పదవ తేదీన ఉపవాసం పాటిస్తారో వారి వల్ల గత సంవత్సరంలో జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి." (ముస్లిం)

**(2) (రమజాను ముందు వచ్చే) షాబాన్ మాసంలో ఎక్కువ ఉపవాసాలు పాటించటం :** హ్రజత్ ఆయిషా (ర. అన్హా) కథనం: "దైవ ప్రవక్త (స) రమజాను తర్వాత ఇతర నెలల్లో అన్నింటికన్నా ఎక్కువగా షాబాన్ నెలలో ఉపవాసాలు పాటించేవారు." ( బుఖారీ - ముస్లిం)

**(3) అరబీ మాసాలలోని 13,14,15వ తేదీన ఉపవాసాలు:**
హ్రజత్ అబూ జర్ర్ గిఫారీ (రజి) కథనం: "ప్రతి అరబీ మాసం (చంద్ర మాసం) లోని మూడు పున్నమి దినాల్లో అంటే 13,14,15 తారీకుల్లో ఉపవాసం పాటించమని దైవ ప్రవక్త (సల్లం) మమ్మల్ని ఆదేశించారు. ఆ మూడు ఉపవాసాలు పాటించటం జీవితాంతం ఉపవాసాలు పాటించటంతో సమానమని ఆయన చెప్పారు." (నసాయి)

**(4) సోమవారం, గురువారం నాటి ఉపవాసం:** దైవ ప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: "ప్రతి సోమవారం మరియు గురువారం నాడు మానవుల ఆచరణలు (దైవ సన్నిధిలో) ప్రవేశ పెట్టబడతాయి. అందుచేత నా ఆచరణలు నేను ఉపవాసమున్న స్థితిలో ప్రవేశ పెట్టబడటాన్ని నేను ఇష్టపడతాను." (అహ్మద్, తిర్మిజీ)

**(5) షవ్వాల్ (అంటే రమజాన్ తర్వాత వచ్చే) మాసపు ఆరు ఉపవాసాలు:** దైవ ప్రవక్త (స) ఈ విధంగా ప్రవచించారు: "రమజాన్ నెల ఉపవాసాలతో పాటు షవ్వాల్ నెలలో ఆరు రోజులు ఉపవాసాలు పాటిస్తే సంవత్సరం మొత్తం ఉపవాసాలు పాటించినట్లే."✶ (బుఖారీ, ముస్లిం)

**(6) హజ్జ్ చేయనివారు జిల్ హిజ్జా మాసపు తొమ్మిదవ తేదీన ఉపవాసం పాటించటం:** ప్రస్తుతం హజ్జ్ చేయనివారు జిల్ హిజ్జా మాసపు తొమ్మిదవ తేదీన (అంటే అరఫా రోజున) ఉపవాసం పాటిస్తే (గత ఏడు, వచ్చే ఏడు) రెండేళ్ళ పాపాలు క్షమించబడతాయి. (ముస్లిం, తిర్మిజీ)

---

✶సాధారణంగా ఇలాంటి హదీసులు చూసి మనం "రమజాన్ మరియు షవ్వాల్ మాసపు ఆరు ఉపవాసాలు పాటిస్తే సంవత్సరం మొత్తం ఉపవాసం పాటించటం తో సమానం ఏమిటా?" అని ఆశ్చర్యపోతాం. కాని కాస్త ఆలోచించి చూస్తే దైవ ప్రవక్త (సల్లం) పలుకుల్లోని మర్మం మనకు బోధపడుతుంది. ప్రతి మంచికి పది రెట్లు పుణ్యం లభిస్తుందన్నది ఇస్లాంలో ఓ సార్వత్రిక సూత్రం. ఆ సూత్రం ప్రకారం ఒక నెల ఉపవాసం పాటిస్తే పది నెలలు ఉపవాసం పాటించినంత పుణ్యం లభిస్తుంది. ఆ తర్వాత ఆరు రోజులు ఉపవాసం పాటిస్తే, ఆరు పదులు, అరవై రోజులు అనగా రెండు నెలలు ఉపవాసం పాటించినంత పుణ్యం లభిస్తుంది. ఆ విధంగా మొత్తం పన్నెండు నెలలు (అనగా ఒక సంవత్సరం) ఉపవాసం పాటించినట్లే కదా!

# కళంకం



ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

నీవు చేసే వర్తకం
మానవతకే ఓ కళంకం

మనిషిలోని మనసులోన
నిదురపోయే దానవునికి
చురక పెట్టి లేపుతావా?
బురద కోర్కెలు చిమ్ముతావా?
॥ నీవు ॥

ఇంటిలోని పూలవనమై
వెల్లి విరిసే వసంత రుతువును
కాలరాయగ రేగుతావా?
కూలదోయగ బూనుతావా?
॥ నీవు ॥

వ్రీడ బరువుకు వాలి ఉండే
పడతి కనులకు బరితెగించి
చంచలంగా చూపు కలిపే
విద్య నేర్పావా?
॥ నీవు ॥

సిగ్గు సిరిని అమ్మివేసి
మాననీమణి శీల కుసుమం
అంగడిలో అమ్మటానికి
వెలికి తెచ్చావా?
॥ నీవు ॥

**('మోడలింగ్' పేరిట అతివను అర్థ నగ్నంగా, ముప్పాతిక నగ్నంగా అంగడిలో ఆవిష్కరించే వర్తకం ఊపందుకున్న రోజుల్లో - 1989లో - గురువర్యులు జనాబ్ సుల్తాన్ ముహియుద్దీన్ మలిక్ గారు కలత చెందిన మనసుతో వ్రాసిన కవితలోని కొన్ని భాగాలివి).**

**- ఎడిటర్**



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

# డబ్బు..డబ్బు..డబ్బు..!

అవును డబ్బు అవసరమే. డబ్బు అత్యవసరమే. డబ్బు నిత్యావసరమే. రుచికరమైన వంటలు తినాలన్నా డబ్బు కావాలి. అందమైన దుస్తులు ధరించాలన్నా డబ్బు కావాలి. దర్జాగా కారులో షికారు కెళ్ళాలన్నా డబ్బు కావాలి. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలన్నా డబ్బు కావాలి. అమ్మాయి పెండ్లి చేయాలన్నా డబ్బు కావాలి. ఎప్పుడైనా డాక్టరును సంప్రదించాలన్నా డబ్బు కావాలి. చివరికి మస్జిదు నిర్మించాలన్నా, ధార్మిక పాఠశాల నిర్వహించాలన్నా, జనులకు సత్య సందేశం ఇవ్వాలన్నా, హజ్ ఉమ్రా చేయాలన్నా డబ్బు అవసరమే మరి.

కనుక డబ్బు సంపాదించాలి. బాగా సంపాదించాలి. అల్లాహ్ ప్రసాదించిన శక్తిని, యుక్తిని వినియోగించి ఆరోగ్యాన్ని, యవ్వనాన్ని గొప్పగా భావించి దైవానుగ్రహాన్ని అన్వేషించాలి. అయితే దైవాన్ని మాత్రం విస్మరించకూడదు. దైవాజ్ఞల్ని ఉల్లంఘించకూడదు. అప్పుడే మీ సంపాదనలో శుభం ఉంటుంది. ఆ సంపాదన సుఖాన్ని స్తుంది. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

"నమాజు ముగిసిన తరువాత భూమిపై వ్యాపించండి. అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి. అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ ఉండండి. బహుశా మీకు సాఫల్య భాగ్యం కలగ వచ్చు. (సూరతుల్ జుమా – 10)

డబ్బు సంపాదించాల్సిందే. కాని డబ్బు తగలెట్టకూడదు. కష్టపడి సంపాదించిన డబ్బుతో సారాయి త్రాగి చెడ్డ దారులు తిరిగి రోగాలకు గురికాకూడదు. దురాశకుపోయి పేకాట ఆడి కష్టార్జితాన్ని పాడు చేసుకొని నిందలపాలు కాకూడదు.

డబ్బు సంపాదించాలి. కాని ధన వ్యామోహానికి గురి కాకూడదు. ధనాన్ని కూడ బెట్టి దానిని మాటి మాటికీ లెక్కబెట్టకూడదు. ధనం కలకాలం మన వెంట ఉంటుందని మోస పోకూడదు. సూరతుల్ హుమజాలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "ప్రజలను దెప్పి పొడవటంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరచేవాడూ, ధనాన్ని కూడబెట్టి దానిని మాటి మాటికీ లెక్కబెట్టి ఉంచేవాడూ అయిన ప్రతి వ్యక్తీ సర్వనాశనమవుతాడు. అతడు తన ధనం తన వద్ద కలకాలం ఉంటుందని అనుకుంటున్నాడు. అలా ఎన్నటికీ జరగదు. అతడు నుజ్జు నుజ్జు చేసే స్థలంలో విసరి వేయబడుతాడు. అలా నుజ్జు నుజ్జుగా చేసే స్థలం ఏమిటో నీకు తెలుసా? అది తీవ్రంగా ప్రజ్వరిల్లజేయబడిన దైవాగ్ని. అది గుండెలదాక చొచ్చుకు పోతుంది. అందులో వారు పడిన తరువాత అది మూసి వేయబడుతుంది. ఆ విధంగా వారు పొడుగాటి అగ్ని కీలల మధ్య చిక్కుకుని ఉంటారు."

డబ్బు సంపాదించాలి. కాని ఆ డబ్బుతో కుటుంబాలను కూల్చే, బ్రతుకులను బజారు పాలు చేసే అధర్మ మార్గాలను అనుసరించకూడదు. అంటే సారాయి కొట్టు, బ్రాందీ షాపు నడపరాదు. వడ్డీ వ్యాపారం చేయరాదు. రాజకీయ గూండాలతో చేతులు కలిపి, అన్యాయానికి హింసకు పాల్పడరాదు.

అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు : "విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది. షైతాను సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధ విద్వేషాలను సృష్టించాలనీ, మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండీ నమాజుల నుండీ వారించాలనీ కోర్తాడు. కనుక మీరు వీటిని మానుకుంటారా లేదా?

(సూరతుల్ మాయిద – 90,91)

డబ్బు సంపాదించాలి. అంతేగాని కట్నం కానుకల కోసం ఎదురు చూడకూడదు. అత్తింటిపై అత్యాశకు పోరాదు. తాళి కట్టిన భార్యను వేధించరాదు. ఎవరి హృదయం నుండి ఆత్మగౌరవం, రోషం, అభిమానం సెలవు తీసుకుంటుందో వారే అత్తింటిపై ఆధారపడతారు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రబోధించారు:

"పైచెయ్యి (ఇచ్చే చెయ్యి) క్రింది చెయ్యి (అర్థించే చెయ్యి) కన్నా ఉత్తమమైనది. డబ్బు సంపాదించాలి. కాని ఆత్మాభిమానాన్ని చంపుకొని, భజనపరులుగా మారి యజమానుల నుండి డబ్బు గుంజకూడదు. నిరపేక్షాభావాన్ని అలవరచుకోవాలి. మన అవసరాలు ఇతరుల ముందు ఎన్నడూ ఉంచరాదు.

డబ్బు సంపాదించాలి. కాని, తల్లిదండ్రుల, బంధువుల, అనాథుల, నిరుపేదల, బాటసారుల హక్కును విస్మరించరాదు. వెండి బంగారాలను ప్రోగుచేసి దైవమార్గంలో దైవ దాసులపై ఖర్చు పెట్టని వారికి పరలోకంలో వ్యధాభరితమైన శిక్ష ఉందన్న దైవ వాక్కును గుర్తుపెట్టుకోవాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "మేము ఏమి ఖర్చు చెయ్యాలి? అని ప్రజలు అడుగుతారు. మీరు ఏమి ఖర్చు చేసినా దానిని మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథులు, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చెయ్యండి. మీరు ఏ మేలు చేసినా దాన్ని అల్లాహ్ తెలుసుకుంటాడు అని వారికి చెప్పండి". (అల్ బఖర – 215)

"వెండి బంగారాలను పోగుచేసి వాటిని దైవ మార్గంలో ఖర్చు పెట్టని వారికి వ్యధా భరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒక రోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి– ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది. ఇదిగో ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి."

(అత్ తౌబా: 34,35)

అల్లాహ్ మన సంకల్పంలో శుద్ధిని, సంపాదనలో శుభాలను ప్రసాదించుగాక! సత్కార్యాలలో పాలు పంచుకొనే సద్బుద్ధిని అనుగ్రహించుగాక! (ఆమీన్)



# విశ్వాసుల మాత
# హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)-3



– అబూ తఫ్హీమ్
ipctelugu@rediffmail.com

హిజ్రీ 10వ సంవత్సరం .... దైవ ప్రవక్త (స) వారి అంతిమ హజ్జ్ యాత్ర సందర్భం.... ఆ సందర్భంగా విశ్వాసుల మాత **హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** అస్వస్థతకు లోనయ్యారు. అయినాసరే ఆమె పట్టు వీడకుండా దైవ ప్రవక్త (స) వెంట మక్కా వచ్చారు. కాబా గృహ ప్రదక్షిణ చేయాల్సిన సమయంలో దైవ ప్రవక్త (స) ఆమె గార్కి సలహా ఇస్తూ, "ఫజ్ర్ నమాజ్ కొరకు అందరూ నిలబడినప్పుడు నువ్వు ఒంటెపై కూర్చొని కాబా ప్రదక్షిణ చేసుకో" అన్నారు. ప్రవక్త సలహాను ఆమె పాటించారు.

హిజ్రీ 11వ ఏట దైవ ప్రవక్త (సఅసం) వ్యాధి గ్రస్తులయ్యారు. ఎంతకీ స్వస్థత చేకూరక పోవటంతో ఆయన (స) హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి కుటీరంలోనే మకాం వేశారు. **హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** తరచూ అక్కడికి వెళ్ళి దైవ ప్రవక్త (సఅసం)ను చూసి వస్తుండేవారు. ఒక రోజు ప్రవక్త (స) గారి బాధను చూసి బావురుమన్నారు. "ఈ విధంగా పెద్దగా ఏడ్వటం విశ్వాసులకు శోభించదు" ని దైవ ప్రవక్త (సఅసం) చెప్పడంతో ఆమె కుదుట పడ్డారు.

**హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** గారి ప్రత్యేకత ఏమిటంటే ఆమె ఖుర్ఆన్ పారాయణం చేస్తుంటే అచ్చం దైవ ప్రవక్త (స అసం) పఠించినట్లే ఉండేది. దైవ ప్రవక్త (స అసం) ఖుర్ఆన్ పారాయణం ఎలా చేసేవారని ఎవరో అడిగితే, "ఆయన (స అసం) ఒక్కొక్క ఆయత్‌ను స్పష్టంగా విడదీసి చదివేవారు. ఇదిగో, ఇలా పఠించేవార"ంటూ తను స్వయంగా చదివి విన్పించారు.

**హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** 378 హదీసులను ఉల్లేఖించారు. మహా ప్రవక్త (స) మహితోక్తులంటే చెవి కోసుకునేవారు. ప్రవక్త ప్రవచనాలను ఉల్లేఖించడంతోపాటు, ధర్మ సందేహాల నివృత్తి చేసేవారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను షరీయతు సూత్రాలతో అన్వయించే ప్రయత్నం చేసేవారు. ఆమె గారిచ్చిన ధార్మిక తీర్పులను గనక సేకరిస్తే ఓ పుస్తకమే అవుతుందని అల్లామా ఇబ్నె ఖయ్యూమ్ అభిప్రాయపడ్డారు.

**హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** జీవితం సాత్వికతకు, నిరాడంబరతకు ప్రతి రూపం. ప్రతి నెలా కనీసం మూడు రోజులు నఫిల్ ఉపవాసాలు పాటించేవారు. సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎంతో ఆసక్తి కనబర్చేవారు. ఆమె స్వయంగా దాన శీలి. దానధర్మాలు చేయమని ఇతరులకు కూడా చెబుతూ ఉండేవారు.

ఒకసారి ఒక యాచకుడు ఈమె ఇంటికి వచ్చి యాచించాడు. ఆ సమయంలో ఎవరో ఒక మహిళ అక్కడుంది. "వెళ్ళిరా నాయనా!" అని ఆ మహిళ యాచకుడితో చెప్పింది. అప్పుడు హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా) కల్పించుకుని, "వద్దొద్దు. మనం అలా చెప్పకూడదు" అన్నారు. ఆ తర్వాత ఆమె తన సేవకురాలిని పిలిచి, "ఇంట్లో ఏదన్నా ఉంటే అతనికి ధర్మం చెయ్యి. ఒక్క ఖర్జూరమున్నాసరే ఇచ్చి పంపించు" అని ఆదేశించారు.

**హజ్రత్ ఉమ్మె సల్మా (ర.అన్హా)** హిజ్రీ 63లో పరమ పదించారు. అప్పటికి ఆమెకు 84 ఏండ్లు. హజ్రత్ అబూ హురైరా (రజి) ఈమె అంత్య క్రియల (జనాజా) నమాజుకు సారథ్యం వహించారు. మదీనాలోని "జన్నతుల్ బఖీ" ఖనన వాటికలో ఖననం చేయబడ్డారు.

**– రజియల్లాహు అన్హా వ రజత్ అన్హు –**

(సమాప్తం)



PAGE 8-9.pdf 10/7/07 9:03:49 PM

పవిత్ర జీవితం

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

# హజ్రత్ ఉమర్ (రజి) ధర్మ స్వీకారం



సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

అన్యాయం, అక్రమాల కారు మబ్బుల్లో మరో మెరుపు తళుక్కున మెరిసింది. అదే ఖత్తాబ్ పుత్రుడగు ఉమర్ గారి ధర్మ స్వీకారం. హజ్రత్ హమ్జా (రజి) ఇస్లాం స్వీకరణ జరిగిన మూడు రోజుల అనంతరం ఈ సంఘటన జరిగింది. ఉమర్ ఇస్లాం స్వీకరించాలని దైవ ప్రవక్త (స) దుఆ చేస్తూ ఉండేవారు. హజ్రత్ ఉమర్ గొప్ప ధైర్యశాలి. ప్రతాప రుద్రుడు. ఆయన ధర్మ స్వీకారానికి కారణం; ఓ రోజు విరోధ తాపంతో కరవాలం పట్టుకుని మహా ప్రవక్త (స) ను కడతేర్చే ఉద్దేశంతో బయలుదేరారు. దారిలో ఓ వ్యక్తి ఎదురై 'ఉమర్! ఎక్కడికి బయలుదేరావు?' అని అడిగితే 'ముహమ్మద్ (స)ను హతమార్చ డానికి' అన్నారు. అందుకు ఆ వ్యక్తి నీకు దీనికన్నా ఆశ్చర్యకర విషయం తెలియజేయనా? స్వయంగా నీ చెల్లెలు, నీ బావగారే ఇస్లాంను ఆశ్రయించారు. నీవు నడుస్తున్న మార్గానికి వారు ఎప్పుడో స్వస్తి పలికారు' అన్నాడు.

ఇది వినగానే ఆయన (చెల్లి) ఇంటికి వచ్చారు. అక్కడ వారిద్దరితో పాటు ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) కూడా ఉన్నారు. ఆయన చేతిలో ఖుర్ఆన్ ఉంది. ఆయన ఆ గ్రంథంలోని 'తాహా' అధ్యాయాన్ని చదువుతున్నారు. ఖబ్బాబ్ (రజి) గారి పఠనాన్ని ఉమర్ విన్నారు. "ఇప్పుడు నేను విన్నది ఏమిటి? మీరిద్దరూ ఇస్లాం గాని స్వీకరించారా?" అని గర్జించారు. ఆయన చెల్లెలు– "ఉమర్! సత్యం నీ సంప్రదాయంలో కాక మరో దాంట్లో ఉంటే నువ్వు ఏమంటావు?" అని నిర్మోహమాటంగా అనేసరికి, ఉమర్ మరింత రెచ్చిపోయి చెల్లిపై విరుచుకుపడ్డారు. ఆమె తల నుండి రక్తం కారేంత వరకూ కొడుతూనే ఉన్నారు.

తుదకు తన చెల్లి రక్తసిక్తం అవడం చూసి కోపం చల్లారింది. సిగ్గు చెందారు. "సరే ఈ గ్రంథాన్ని నాకివ్వండి" అన్నారు. 'నువ్వు ముందు స్నానం చేసిరా' అంది చెల్లెలు. ఉమర్ వెళ్ళి స్నానం చేసి వచ్చారు. ఆ తర్వాత ఖుర్ఆన్ తీసుకొని చదవనారంభించారు.



బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్
త్వాహా ....అంటూ ప్రారంభించి,"నిస్సందేహం గా నేనే అల్లాహ్‌ను (దేవుణ్ణి), నేను తప్ప మరొక దేవుడు లేడు. దాస్యం నాకే చేయండి. నన్నే ఆరాధించండి." అనే వచనం వరకు చేరాక అప్రయత్నంగా 'ఎంత మధురమైన పలుకులివి! ఎంత పవిత్రమైన వాణి ఇది!!' అన్నారు.

ఆ తర్వాత "నాకు ప్రవక్త (స) గారు ఎక్కడున్నారో తెలుపండి" అని కోరారు. ఆ పిదప కరవాలం పట్టుకొని, ప్రవక్త (స) తన సహచరులతో సమావేశమైవున్న ఇంటి వైపు బయలుదేరారు. అక్కడికి వెళ్ళి ప్రవక్త (స)ను చూసిన మరుక్షణమే "అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్, వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" అని అంటూ ఇస్లాం స్వీకరించారు. ఇంట్లో ఉన్న ప్రవక్త (స) గారి అనుయాయులు ఆనందాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ బిగ్గరగా నినదించారు.

## సంఘ బహిష్కరణ

మహా ప్రవక్త (స) ను హతమార్చాలన్న ప్రతిపాదనతో అబూ లహబ్ మినహా బంధువుల్లోని ఎవరూ ఏకీభవించలేదు. బనూ అబ్దుల్ ముత్తలిబ్, బనూ హాషిమ్ వారైతే గట్టిగా అభ్యంతరం తెలిపారు. అందువల్ల విగ్రహారాధకులంతా సమైక్యమై వారిలోని ముస్లింలను, అభ్యంతరం తెలిపిన విగ్రహారాధకులను కూడా సంఘ బహిష్కరణ చేయాలని తీర్పునిచ్చారు. ప్రవక్త (స) గారిని హతమార్చడానికి వారు స్వయంగా మాకు అప్పగించనంతవరకూ వారితో ఎవరూ చుట్టరికం పెట్టుకోరాదు. వారితో పెళ్ళి పేరంటాల సంబంధాలు పెట్టుకోరాదు. వారితో వ్యాపార లావాదేవీలు జరపరాదు. వాళ్ళతో కలిసి మెలసి కూర్చోరాదు. వారితో ఎటువంటి సంభాషణలు జరుపరాదు అన్న ఒప్పందం వ్రాసి కాబా గృహ మధ్యలో లోపల వేలాడగట్టారు. అంతటితో ఆగక, బనూ అబ్దుల్ ముత్తలిబ్, బనూ హాషిమ్ వంశీయులని 'షోబె అబూ తాలిబ్' అనే పర్వత లోయలో నిర్బంధించారు....... ఎంతో కష్టభూయిష్టమైన ఈ నిర్బంధం మూడేండ్ల పాటు కొనసాగింది. చివరికి (ఆకలి బాధను తట్టుకోలేక) వారు ఎండిపోయిన చెట్ల ఆకులను కూడా తినాల్సి వచ్చింది. వారి స్త్రీల, పిల్లల ఆకలి బాధలతో కూడిన ఆక్రందనలు ఆ లోయ బయట వరకు విన్పించేవి.......... ఈ దయనీయ స్థితి ఆ ఒప్పందం చెరిగిపోయేంత వరకు అంటే మూడు సంవత్సరాల వరకు కొనసాగింది. ఎందుకంటే స్వయంగా ఖురైషీయుల మధ్యనే ఈ ఒప్పందం గురించి భిన్న స్వరాలు విన్పించాయి. "ఇది మరీ విపరీతం" అన్న అభిప్రాయం వారిలో ప్రబలింది. ఈ ఒప్పందాన్ని నిరసించినవారు ఒప్పంద పత్రాన్ని చింపేయాలని ప్రయత్నించారు. విగ్రహారాధకుల్లోని ఓ వ్యక్తియే దాన్ని చింపేయాలని బయలుదేరాడు. అయితే అప్పటికే "బిస్మికల్లాహుమ్మ" ను మినహాయించి మిగతా ఒడంబడిక పత్రాన్నంతా చెదలు తినివేసింది. దీని తర్వాత ఒడంబడిక దానంతట అదే రద్దయి పోయింది. దైవ ప్రవక్త (స) మరియు ఆయనతో ఉన్నవారంతా స్వేచ్ఛాజీవులై ఆ లోయ నుండి విముక్తి పొందారు.

(ఇంకా ఉంది)

హదీసు కిరణాలు



మూలం
**రియాజుస్సాలిహీన్**

# సౌభాగ్యానికి సోపానం



తెలుగు అనువాదం
**హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్**

✷ హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : దానధర్మాలు సంపదలో లోటును ఏర్పరచవు. దేవుడు మన్నింపుల వైఖరిని అవలంబించే దాసుని గౌరవాన్ని మరింత పెంచుతాడు. ఎవరైనా దైవం కోసం అణకువను ప్రదర్శిస్తే దేవుడు అతనికి ఔన్నత్యాన్ని ప్రసాదిస్తాడు.

(ముస్లిం) (సహీహ్ ముస్లింలోని సత్కార్యాలు సత్సంబంధాల ప్రకరణం)

**ముఖ్యాంశాలు**

1. పై హదీసు దానధర్మాల వల్ల సంపదలో వెలితి రాదని చెబుతోంది. నిజమే.....! మనిషి దానం చేస్తే దేవుడు తతిమ్మా ధనంలో శుభాన్ని అవతరింపజేస్తాడు. కొన్నిసార్లు ఇహలోకంలోనే దానికి రెట్టింపు ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ఇహలోకంలో ఆ దానానికి ఎలాగూ పుణ్యం లభిస్తుంది. కనుక ఏ విధంగా చూసినా దానధర్మాల వల్ల మనిషి సంపదకు నష్టం లేదు.
2. తను మన్నింపుల వైఖరిని అవలంబిస్తే ప్రజలు తనను తక్కువగా అంచనా వేస్తారనీ, తనను బలహీనుడిగా తలపోస్తారని అనుకుంటాడు మనిషి. కాని దానికి భిన్నంగా ఈ హదీసులో దేవుడు అలాంటి వారికి ప్రజల్లో గౌరవ మర్యాదలను ప్రసాదిస్తాడని చెప్పబడింది. క్షమాగుణంతో వ్యవహరించేవారిని సాధారణంగా జనం గౌరవిస్తారు. అంతేకాదు, పరలోకంలో కూడా అలాంటి వారికి గొప్ప పుణ్యఫలం లభిస్తుంది. ఆ విధంగా మనిషి అటు దైవం దృష్టిలోనూ, ఇటు జనం దృష్టిలోనూ గౌరవ వంతునిగా భావించబడతాడు.

✷ హజ్రత్ అస్మా బిన్తె అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి. అన్హా) కథనం: ఒక సారి దైవప్రవక్త (సల్లం) నాతో మాట్లాడుతూ, " ధనం మూటగట్టి ఉంచుకోకు. అలా చేస్తే దేవుడు కూడా (నీకివ్వకుండా) మూటగట్టి ఉంచుతాడు " అన్నారు.

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఖర్చు పెట్టు. పదే పదే లెక్క పెట్టకు. అలా చేస్తే దేవుడు కూడా లెక్కపెట్టి మరీ ఇస్తాడు. అలాగే మాటిమాటికి సర్దిపెట్టమాకు. అలాచేస్తే దేవుడు నీ పట్ల కూడా అలాగే వ్యవహరిస్తాడు ". (బుఖారీ - ముస్లిం) (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని జకాత్ ప్రకరణాలు)



✷ హజ్రత్ అబూ హురైరా (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: ఒకాయన ఓ మైదానంగుండా వెళుతుండగా మేఘాల్లో నుంచి, "ఫలానా వ్యక్తి తోటలో వర్షం కురిపించు" అని (ఎవరో ఆజ్ఞాపిస్తున్నట్లు) వినపడింది. అంతలో ఆ మేఘాల్లో నుండి ఒక మబ్బుతునక విడిపోయి ఓ నల్లని రాతి నేలపై వర్షం కురిపించింది. (దాంతో చిన్న చిన్న కాలువలు ఏర్పడ్డాయి). చివరకు ఒక (పెద్ద) కాలువ మిగతా కాలువలన్నిటిని తనలో కలుపుకొని ప్రవహించసాగింది. అది చూసి ఆయన కూడా ఆ ప్రవాహం వెంట నడవసాగాడు. (కొంత దూరం వెళ్ళాక) ఆయనకు ఎవరో ఒక వ్యక్తి తన తోటలో నిలబడి తన దగ్గరున్న పని ముట్టుతో తోటకు నీళ్ళు పెడుతున్నట్లు కనిపించాడు. ఆయన అతని దగ్గరికెళ్ళి "ఓ దేవుని దాసుడా! నీ పేరేమిటి?" అని అడిగాడు. తాను ఇంతకు ముందు మేఘాల్లో విన్న పేరే చెప్పాడా వ్యక్తి. అతను "ఎందుకు అడుగుతున్నారు?" అన్నాడు. అందుకాయన "కురిపించిన మేఘంలో నుండి, 'ఫలానా వ్యక్తి తోటలపై వర్షం కురిపించు' అని (ఎవరో ఆజ్ఞాపిస్తున్నట్లు) విన్నాను. నువ్వు చెప్పిన పేరూ నేను విన్న పేరూ ఒక్కటే. అది సరేకాని (దేవుడు ప్రత్యేకంగా నీ తోటలోనే వర్షం కురిపించమని మేఘాల్ని ఆదేశించటానికి) అసలు నువ్వు చేస్తున్న పనేంటి?' అని అడిగాడు. దానికా వ్యక్తి "మీరు అడిగారు కాబట్టి చెబుతున్నాను. ముందుగా నేను ఈ తోటలో పండే పంటను అంచనా వేసుకుంటాను. మొత్తం పంటలో మూడో వంతు దానం చేస్తాను. మరో మూడో వంతు నాకూ, నా ఆలుబిడ్డల ఆహారానికి సరిపోతుంది. మిగతా మూడో వంతును నేను వచ్చే పంటకోసం ఉపయోగిస్తాను" అని చెప్పాడు.


(ముస్లిం) (సహీహ్ ముస్లింలోని ఐహిక అనాసక్తత ప్రకరణం)

**ముఖ్యాంశాలు**

ఈ హదీసులో కూడా దానధర్మాల గొప్పదనంతో పాటు మహిమలు, అద్భుతాల గురించి వివరించటం జరిగింది. ఒక మనిషి మేఘాల నుంచి మాటలు విన్నాడు. అసలు సాధారణంగా ఇలా జరగదు. కాని దేవుడు తలచుకుంటే అది అసంభవం కూడా కాదు. అయితే మానవుల్లో ఎవరూ కూడా తాను తలచినప్పుడు మహిమలు ప్రదర్శించగలననీ, విశ్వ సూత్రాలకు విరుద్ధమైన పని చేసి చూపించగలనని బొంకలేదు. దేవుడు తలచినప్పుడే అలాంటి అద్భుతాలు జరుగుతాయి. ఈ రోజుల్లో చాలామంది మహిమలు, అద్భుతాల పేరుతో జనాన్ని మోసం చేస్తున్నారు. జనం వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

PAGE 10-11.pdf 10/7/07 9:06:14 PM





# దైవ మార్గంలో ఖర్చు పెట్టండి మీ సంపద వికసిస్తుంది



-అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

"విశ్వసించిన ఓ ప్రజలారా! క్రయ విక్రయాలు కూడా జరగని, స్నేహం కూడ ఉపయోగపడని, సిఫారసు కూడా చెల్లని (తీర్పు) దినం రాక పూర్వమే మేము మీకు ప్రసాదించిన సిరి సంపదల నుండి (మా మార్గంలో) ఖర్చు పెట్టండి. వాస్తవంగా అవిశ్వాస మార్గం అవలంబించేవారే పరమ దుర్మార్గులు." (2: 254)

ఈ వాక్యంలో మనల్ని ఆలోచింపజేసే కొన్ని వాక్యాలున్నాయి.

(1) తీర్పు దినాన అల్లాహ్ న్యాయస్థానంలో ఎవరూ ఎవరికీ పనికి రారు. ఆ ఆపత్సమయాన సర్వాధికారి అయిన అల్లాహ్ పట్టు నుండి తప్పించుకోవాలంటే ఇహలోకంలో దానధర్మాలు చేయవలసి ఉంది.
(2) మానవుల వద్ద తమదంటూ ఏదీ లేదు. వారి వద్ద ఉన్నదంతా అల్లాహ్ అనుగ్రహమే. వారి సంపదలో ఆత్మీయులకు, యాచకులకు, అగత్యపరులకూ హక్కు ఉంది.
(3) "మేము మీకు అనుగ్రహించిందంతా మా మార్గంలో ఖర్చుపెట్టండి" అని చెప్పడం లేదు అల్లాహ్. "మీకు ప్రాప్తమయిన దానిలో నుండి నిర్ణీతమైన హక్కును మాత్రమే ఇవ్వండి చాలు" అని అంటున్నాడు.
(4) దానధర్మాలు చెయ్యడం, ధర్మ సంస్థాపనా మార్గంలో ఖర్చు చేయడం అన్నది విశ్వాసానికి, కృతజ్ఞతా భావానికి నిదర్శనం. లోభత్వం, పిసినారితనం అన్నది అవిశ్వాసానికి, కృతఘ్నతకు ఆనవాలు. పిసినారులు నిజానికి తమ ఆత్మలకే అన్యాయం చేసుకుంటారు.

### మహాశయులారా!

విశ్వ ప్రభువు అయిన అల్లాహ్ తాను అమితంగా ప్రేమించే తన దాసుల గుణాలను వర్ణిస్తూ ఇలా అన్నాడు: "వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపదను ఖర్చు చేసేవారు." (3:134)

పేదరికానికి భయపడకుండా ధర్మ మార్గంలో ఎల్లవేళలా ఖర్చు చేసేవారి గురించి ఇలా సెలవియ్యడం జరిగింది: " తమ సంపదను రేయింబవళ్ళు బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసేవారికి తమ ప్రభువు వద్ద గొప్ప ప్రతిఫలం ఉంది. వారికి తీర్పు దినాన ఏ విధమైనటువంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." ( 2: 274)

దానధర్మాలు చేసేవారికి ఇహలోకంలోనూ మేలు ఉందని, వారి సంపదలో శుభాన్ని ప్రసాదించి, వారి ఊహకు కూడా అందనటువంటి విధంగా సమృద్ధిని వొసగుతానని ఒక ఉపమానం ద్వారా తెలియజేశాడు విశ్వ ప్రభువు.

ఉపమానం ఇలా ఉంది: "ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలుంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపజేస్తాడు."

(2: 261)

"దీనికి భిన్నంగా స్వయంగా పిసినారితనంతో ప్రవర్తిస్తూ, తమ ఆచరణ ద్వారా ఇతరులకూడా పిసినారితనాన్ని గురించి ఆజ్ఞాపించే వారిని అల్లాహ్ ఎన్నడూ ప్రేమించడు. ఇలాంటి కృతఘ్నులకు తీర్పు దినాన భయంకరమైన శిక్ష ఉంది. ఆ శిక్ష ఏమిటంటే, సత్కార్యాలలో వారు ఖర్చు పెట్టకుండా పోగు చేసిన వెండి, బంగారాలను నరకాగ్నిలో కాల్చి, వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యడం జరుగుతుంది. ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది. ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి" అని వారితో చెప్పడం జరుగుతుంది."(4:37; 9: 35)

మరణానంతర జీవితంలో వ్యధాభరితమైన నరక యాతన నుండి తప్పించుకోవాలని , అల్లాహ్ ప్రసన్నతకు, స్వర్గానికి అర్హులు కావాలని కోరుకునేవారు అల్లాహ్ అనుగ్రహించిన సంపద నుండి ఖర్చు చేయవలసిందే. అది కూడా మరణ సమయం సమీపించక ముందే ఖర్చు పెట్టాలి. ఆచరణా వ్యవధి ముగిసిపోయే సమయం ఆసన్నమైనప్పుడు "ఓ ప్రభూ! నీవు నాకు మరింత వ్యవధి ఎందుకు ఇవ్వలేదు. నేను కూడా దానధర్మాలు చేసి సజ్జనుల్లో చేరిపోయేవాణ్ణి కదా!" అని వాపోయే పరిస్థితి మీలో ఏ ఒక్కరికీ రాకూడదు సుమా! అని ముందుగానే హెచ్చరిస్తున్నాడు కారుణ్య ప్రభువు. (63: 10,11)

ఈ విషయాలు విన్న తరువాత ఖర్చు చేయాలన్న తలంపు ప్రతి నిజ ముస్లింకు కలుగుతుంది. అయితే ఎక్కడ ఖర్చు చేయాలి? ఎవరి కొరకు ఖర్చు చేయాలి? అల్లాహ్ సెలవిస్తున్నాడు:

"మీరు ఏమి ఖర్చు చేసినా దానిని మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథలు, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చేయండి. మీరు ఏ మేలు చేసినా అల్లాహ్ దాన్ని తెలుసుకుంటాడు." (2: 215)

ఇచ్చే రుణాలు స్వీకరించబడాలంటే కొన్ని షరతులు పాటించక తప్పదు. అవి:

(1) మనం ఏమి ఖర్చు చేసినా, ఎన్ని దానధర్మాలు ఇచ్చినా కేవలం అల్లాహ్ ప్రసన్నత పొందడమే మన సంకల్పం అయి ఉండాలి. లోకుల మెప్పు కోసం, ప్రదర్శనా బుద్ధితో చేసే సత్కార్యాలు స్వీకరించబడవు.

(2) బహిరంగంగా దానం ఇవ్వడం కన్నా రహస్యంగా దానం ఇవ్వడం ఎంతో ఉత్తమం. (2: 271)

(3) దాతృత్వాన్ని మాటిమాటికి చాటుతూ, గ్రహీతల మనస్సును గాయపరచకూడదు. మనస్సును గాయపర్చే దానం కంటే మృదుభాషణం, క్షమా గుణం ఎంతో మేలైనది." (2: 263)

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. దానధర్మాల గురించి విశ్వ ప్రభువు అల్లాహ్ – ఇంతగా ఎందుకు నొక్కి చెప్పాడు? ఈ ప్రశ్నకు సమాధానం స్వయంగా అల్లాహ్ ఇలా ఇస్తున్నాడు: "సంపద మీ ధనికుల మధ్యనే తిరగకుండా ఉండేందుకు." (59: 7)

దీన్ని బట్టి తెలిసేదేమిటంటే సంపద సమాజంలో ఎల్లప్పుడూ చేతులు మారుతూ ఉండాలి. కేవలం ధనవంతుల మధ్యనే తిరిగితే ధనవంతుడు మరింత ధనవంతుడిగానూ, నిరుపేద మరింత నిరుపేదగానూ అయిపోతాడు. ధనవంతులు పేదలను విస్మరిస్తే పేదలు ధనవంతులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడుపుతారు. పోరాటాలు చేస్తారు. ఫలితంగా సమాజంలో దోపిడీలు, దౌర్జన్యాలు, రాస్తా రోకోలు, మారణ హోమాలు పెచ్చరిల్లి శాంతి, సామరస్యాలే కరువైపోతాయి. కాబట్టి దోపిడీ మనస్తత్వానికి స్వస్తి పలికి సాటి ప్రజలను అవసరార్థం ఆదుకోవాలని పలు మార్లు, పలు చోట్ల నొక్కి చెప్పాడు విశ్వ ప్రభువు అల్లాహ్.

# తౌహీద్ (దేవుని ఏకత్వం)

### తౌహీద్ మూడు రకాలు

'దేవుడు ఒక్కడే' అనే మాటలో మూడు అర్థాలు ఇమిడి ఉన్నాయి:

**(1) తౌహీదె రుబూబియ్యత్ :-** అనగా విశ్వమంతటికీ ప్రభువు ఒక్కడేనని, సర్వాన్ని సృష్టించినవాడు, దాని అధిపతి, సర్వ వ్యవహారాలను నడిపించేవాడు మరియు పోషకుడు కేవలం ఆయన మాత్రమేనని విశ్వసించటం. బహుదైవారాధకులు కూడా ఈ విషయాన్ని నమ్ముతారు. కాని వారు ఆ ఏకైక ప్రభువుతో పాటు మరికొందరు దేవుళ్ళను కూడా నిలబెట్టారు. ఇది ధర్మ విరుద్ధం.

**(2) తౌహీదె ఉలూహియ్యత్ :-** అనగా అన్ని రకాల ఆరాధనలకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే. ఆయన మీద ప్రీతితోగాని లేక ఆయన పట్ల భీతితోగాని చేసే ప్రతి పనీ ఒక ఆరాధనగానే పరిగణించబడుతుంది. కనుక దేవుడు ఒక్కడేనని విశ్వసించే వారందరూ తమ ఆరాధనలన్నింటిని కేవలం అల్లాహ్ కోసం మాత్రమే ప్రత్యేకించుకోవాలి.

**(3) తౌహీదె అస్మా వస్సిఫాత్ :-** అనగా నామాలు మరియు గుణ విశేషాల విషయంలో దేవుని ఏకత్వం. ఖుర్ఆన్, హదీసుల్లో వివరించబడిన అల్లాహ్ పేర్లను, గుణవిశేషాలను ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా విశ్వసించాలి. అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఈ గుణవిశేషాలతో సంబోధించరాదు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వివరించిన పేర్లు మరియు గుణవిశేషాలతో తప్ప మరి వేటితోనూ అల్లాహ్‌ను సంబోధించరాదు.

# సీరత్ క్విజ్

*హబీబుర్రహ్మాన్ జామయీ*

(1) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) తో వివాహ సమయమున ప్రవక్త (స) ఇచ్చిన 'మహర్' ఎంత?

(2) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) వితంతువా?

(3) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) పరమపదించినప్పుడు ఆమె వయసెంత?

(4) వారి దాంపత్య జీవితం ఎలా సాగింది?

(5) ప్రవక్త (స) గారి కోసం ఖదీజా (ర.అన్హా) చేసిన త్యాగం ఏమిటి?

(6) వివాహం తరువాత ప్రవక్త (స) వ్యాపార నిమిత్తం ఎక్కడికైనా ప్రయాణం చేశారా?

(7) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) బ్రతికుండగా ప్రవక్త (స) మరో వివాహం చేసుకున్నారా?

(8) ప్రవక్త (స) సమాజంలో ఎలా గుర్తింపు పొందారు?

(9) ప్రవక్త (స) ఎంత వరకు చదువుకున్నారు?

**జవాబులు** (1) 20 ఒంటెలు (2) అవును. ప్రవక్త (స) ఆమెకు మూడవ భర్త (3) 65 ఏండ్లు (4) 25 సంవత్సరాల వారి దాంపత్య జీవితం ఎంతో అన్యోన్యంగా సాగింది (5) తన వద్దనున్న సిరి సంపదలన్నింటినీ ప్రవక్త (స) కు అర్పించుకున్నారు (6) ఎలాంటి ప్రయాణం చేయలేదు (7) చేసుకోలేదు (8) నిజాయితీ పరుడు (అమీన్), సత్య సంధుడు (సాదిఖ్) గా గుర్తింపు పొందారు (9) చదువుకోలేదు, ఆయన నిరక్షరాసి.

PAGE 12-13.pdf 10/7/07 9:07:45 PM

# ఇస్లాం శిక్షణ

ప్రశ్న : 'అజాన్' అని దేన్నంటారు?

జవాబు: నమాజు వేళ అయినప్పుడు మస్జిదులో ఒక వ్యక్తి నిలుచుని, నమాజు వైపునకు జనులను పిలవటాన్ని అజాన్ అంటారు.

ప్రశ్న : 'తక్బీర్' అని దేన్ని అంటారు?

జవాబు: సామూహిక నమాజు కొరకు అందరూ నిలబడినప్పుడు వారిలో ఒక వ్యక్తి అజాన్ పలుకులనే మళ్ళీ పలుకుతాడు. దీనినే తక్బీర్ లేక ఇఖామత్ అని అంటారు. 'తక్బీర్' లో హయ్యా అలల్ ఫలాహ్ అని చెప్పిన తర్వాత "ఖద్ ఖామతిస్సలాత్" రెండు సార్లు పలకాలి.

ప్రశ్న : 'అజాన్' పిలుపు ఇచ్చేవారిని ఏమంటారు?

జవాబు: ము-అజ్జిన్.

ప్రశ్న : తక్బీర్ పలికే వారిని ఏమంటారు?

జవాబు: ముకబ్బిర్.

ప్రశ్న : అనేక మంది కలిసి చేసే నమాజుని ఏమంటారు? నమాజు చేయించే వారిని, చేసే వారిని ఏమంటారు?

జవాబు: అనేక మంది కలిసి చేసే నమాజుని 'జమాఅత్' (సామూహిక నమాజ్) అంటారు. ఈ నమాజు చేయించే వ్యక్తిని 'ఇమామ్' అంటారు. ఇమామ్ వెనుక నమాజు చేసే వారిని 'ముఖ్తదీ' గా వ్యవహరిస్తారు.

ప్రశ్న : ఒంటరిగా నమాజు చేసే వారిని ఏమంటారు?

జవాబు: మున్‌ఫరిద్.

ప్రశ్న : ప్రత్యేకంగా నమాజు కోసమే నిర్మించి, సామూహికంగా నమాజు సలిపే గృహాన్ని ఏమంటారు?

జవాబు: మస్జిద్.

ప్రశ్న : మస్జిద్‌లో ఏం చేయాలి?

జవాబు: నమాజు చేయాలి. దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేయాలి. దైవ ధ్యానం చేయాలి. మస్జిద్‌లో ఆటలాడటం, వ్యర్థమైన మాటలు మాట్లాడుకోవటం, వ్యాపార లావాదేవీలు జరపటం ఏ మాత్రం వాంఛనీయం కాదు.

ప్రశ్న : నమాజు చేయటం వలన ప్రయోజనం ఏమిటి?

జవాబు: నమాజు వల్ల చేకూరే ప్రయోజనాలు అసంఖ్యాకం. కొన్ని ప్రయోజనాలను మాత్రం ఇక్కడ పేర్కొంటున్నాము.

(1) నమాజు చేసే వారి దుస్తులు, శరీరం పరిశుభ్రంగా ఉంటాయి.

(2) నమాజు చేసే వ్యక్తి పట్ల దేవుడు ప్రసన్నుడై ఉంటాడు.

(3) దేవుని అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) నమాజులను ఎంతగానో ఇష్టపడ్డారు.

(4) నమాజు చేసే వ్యక్తి దైవ సన్నిధిలో పుణ్యాత్ముడుగా పరిగణించబడతాడు.

(5) నమాజు చేసే వ్యక్తిని సమాజంలో సభ్యులంతా గౌరవిస్తారు.

(6) నమాజు చేసే వ్యక్తి ఎన్నో పాపాలకు దూరమైపోతాడు.

(7) నమాజు చేసే వ్యక్తి మరణించిన తర్వాత అతన్నుంచి తేలిక పాటి లెక్క తీసుకోబడుతుంది. దేవుడతనికి సుఖ సౌఖ్యాలను ప్రసాదిస్తాడు.

## చెప్పుకోండి చూద్దాం



(1) పూర్తి ఖుర్‌ఆన్‌లో అతి గొప్ప సూక్తి (ఆయతు) ఏది?

(2) ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన నాలుగు ఫలాల పేర్లు చెప్పండి?

(3) ఏ సూరా పారాయణం వల్ల ఇంటి నుండి దుష్ట శక్తులు (షైతాన్) పారిపోతాయి?

(4) మనిషిని సమాధి శిక్ష నుండి కాపాడటంతో పాటు, అతని పక్షాన నిలబడి సిఫారసు చేసే సూరా పేరేమిటి?

(5) సులుసుల్ ఖుర్‌ఆన్ (మూడవ వంతు ఖుర్‌ఆన్) అన్న బిరుదు ఏ సూరాకు చెందినది?

(6) 'బద్రె మవూనా' సంఘటనలో అమరగతులయిన ఖర్రా (ఖుర్‌ఆన్ పారాయణ కర్త) ల సంఖ్య ఎంత?

(7) ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) తన జాతి వారిని ఎన్నేండ్ల వరకు దైవం వైపునకు పిలిచారు?

(8) 'హల్' (هل) అన్న పదంతో మొదలయ్యే సూరాలను పేర్కొనండి?

(9) 'ముఅవ్వజతైన్' అని ఏ సూరాలను అంటారు?

(10) అగ్ని గుండంలో పడవేయబడిన ప్రవక్త పేరేమిటి?

(సమాధానాలు నవంబరు సంచికలో)

## సెప్టెంబర్ సంచిక సమాధానాలు

(1) సూరయె తాహా (2) సూరయె ఫాతిహా (3) పాల నదులు, తేనె నదులు, (మత్తెక్కించని) మద్యం నదులు, జల ధారలు. (4) పవిత్ర ఖుర్‌ఆన్, సుహుఫె ఇబ్రాహీమ్, తౌరాత్, జబూర్, ఇన్జీల్ (5) జన్నతున్నయీమ్, జన్నతుల్ ఖుల్ద్, దారుల్ ఖరార్, దారుస్సలామ్, దారుల్ ముత్తఖీన్, జన్నతుల్ ఫిర్‌దౌస్, జన్నాతు అద్న్, జన్నతుల్ మావా (6) హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) (7) 25 సార్లు (8) సూరయె నజ్మ్ (9) 14 సజ్దాలున్నాయి (10) సూరయె ముజాదలా.

ఒక వేళ అల్లాహ్ ప్రజల కొరకు ఏదైనా కారుణ్య ద్వారాన్ని తెరిస్తే దానిని అడ్డుకునేవాడు ఎవడూ లేడు. దానిని మూసివేస్తే అల్లాహ్ తర్వాత మళ్ళీ తెరిచేవాడు ఎవడూ లేడు. ఉపాధి ప్రదాతలందరికంటే ఆయనే శ్రేష్టమైన ఉపాధి ప్రదాత. మనం దేనిని ఖర్చు చేసినప్పటికి దాని స్థానంలో ఆయనే మనకు మరింత ఇచ్చేవాడు.

సకల వ్యవహారాలకు సంబంధించిన చివరి తీర్పు అల్లాహ్ చేతిలోనే ఉంది. వాస్తవానికి మనకు విజయము, సహాయము వచ్చేది అల్లాహ్ తరఫు నుంచి మాత్రమే.

ఈ విధంగా అల్లాహ్ యొక్క అనుగ్రహాలను లెక్కించదలిస్తే వ్రాయడానికి భూమి మీద ఉన్న వృక్షాలన్నిటినీ కలాలుగా చేసి, సముద్రపు జలాల్ని సిరాగా చేసినా ఈ సముద్ర జలమే అయిపోతుంది కానీ అల్లాహ్ యొక్క అనుగ్రహాలను మాత్రం లెక్కించలేము.

ఓ సోదరా! అల్లాహ్‌ను కాదని మీరు ఏ దేవుళ్ళను వేడుకుంటున్నారో వారందరూ కలిసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా అలా చేయలేరు. ఒకవేళ ఈగ వారి నుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా వారు దానిని విడిపించుకు రానూ లేరు. ఈ విధంగా మనిషికి ఇన్ని అనుగ్రహాలను ప్రసాదించి భూమి మీద తన ప్రతినిధిగా నియమిస్తే మనిషేమో షైతాను దాస్యం చేస్తూ కృతఘ్నుడుగా నిలబడ్డాడు.

ఓ మనిషీ! ఇప్పటికైనా మించిపోయింది లేదు. మనస్సు పెట్టి ఈ అనుగ్రహాలపైన ఒక్కసారి ఆలోచించు. నీ మనస్సాక్షిని నిలదీసి అడుగు. అది తప్పక స్పందిస్తుంది -

# ప్రేమ....!

- **అల్లాహ్ పట్ల ప్రేమ అంటే-,** కనీసం రోజుకి అయిదు పూటలా నిర్మలమైన మనస్సుతో ఆయన్ను ప్రార్థించటం.
- **దైవ ప్రవక్త పట్ల ప్రేమ అంటే-,** ఆయన ప్రవచన పుస్తకాల్లోని కొన్ని కొత్త పేజీలను చదవటం.
- **ఆచరణ పట్ల ప్రేమ అంటే-,** కనీసం రోజుకో మంచి కార్యం అయినా చేయటం.
- **ఆత్మ పట్ల ప్రేమ అంటే-,** మనతో మనం కనీసం అరగంట అయినా ఏకాంతంగా గడపటం.
- **ఆరోగ్యం పట్ల ప్రేమ అంటే-,** వారానికొక్కసారి అయినా వెళ్ళి రోగుల్ని పరామర్శించి రావటం.
- **భవిష్యత్తు పట్ల ప్రేమ అంటే-,** గతాన్ని నెమరువేసుకుని, జాగ్రత్త పడటం.

ఇలాంటి కొన్ని ప్రేమలు సమైక్యమై తమ సమిష్ఠి కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడు ఏ సమాజమైనా నిండు వసంతాన్ని ప్రతిబింబిస్తుంది. అట్టి ప్రేమ గలవారికి మానవుల ఆశీస్సులే కాక మాధవుడి దీవెనలు సైతం సదా ఉంటాయి.

**రండి ! అట్టి సత్సమాజ నిర్మాణానికి నాంది పలుకుదాం !!**



PAGE 14-15.pdf 10/7/07 9:08:49 PM





మర్యమ్ జానకి

# సుబ్‌హానల్లాహ్ !

## (అల్లాహ్ పరమ పవిత్రుడు)

**సమస్త** స్తోత్రములు అల్లాహ్‌కే. ఆయన తప్ప నిజమైన ఆరాధ్య దైవం ఎవరూ లేరు. ఆయన అద్వితీయుడు, నిరపేక్షాపరుడు, ఎవరి ఆధారమూ, అక్కరా అవసరం లేనివాడు. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరి సమానులు గానీ, సరిపోలిన వారు గానీ ఎవరూ లేరు.

ఖచ్చితమైన విధి నిర్ణయంతో ప్రతి వస్తువుకూ దాని స్వరూపాన్ని ప్రసాదించి తరువాత దానికి మార్గం చూపిన వాడూ అయనే. ప్రతి వస్తువు సంరక్షకుడు కూడా ఆయనే. ఆయనే భూమిని, ఆకాశాలను వీటి మధ్యనున్న చరాచర సృష్టిని ఆరు రోజులలో సృష్టించినవాడు.

ఆయనే ప్రళయ దినానికి అధికారి. రెండు తూర్పులకు, రెండు పడమరలకు – అన్నింటికి యజమాని, ప్రభువు ఆయనే.

ఆయనే భూమిని పాన్పుగా చేసి, మనం దానితోపాటు దొర్లిపోకుండా ఉండటానికి పర్వతాలను మేకులుగా నాటినవాడు. ఆయనే ఒకదానిపై ఒకటి సప్తాకాశాలను మనం చూడగలిగే స్థంభాలు లేకుండా సృష్టించి, మనకు దగ్గర ఉన్న ఆకాశాన్ని మహోజ్వలమైన దీపాలతో (నక్షత్రాలు) అలంకరించి, వాటిని షైతానులను తరిమికొట్టే సాధనాలుగా చేసినవాడు. ఆయనే స్త్రీ గర్భంలో శిశువుకు ఒక ఆకారం తర్వాత మరో ఆకారం ఇస్తూ సృష్టించి మాట్లాడే శక్తి, వినే, చూసే శక్తిని ఆలోచించి అర్థం చేసుకునే మనస్సును ఇచ్చినవాడు. కలం ద్వారా మనకు జ్ఞానాన్ని నేర్పినవాడు ఆ దయాళువే.

ఆయనే ఈ భూమి మీద ఉన్న జీవరాసులను, నిర్జీవులను మన అవసర నిమిత్తం సృష్టించినవాడు.

ఆయనే ఆడ, మగ జంటలను సృష్టించినవాడు. వారిలో తాను కోరిన వారికి కుమార్తెలను, తాను కోరినవారికి కుమారులను, మరికొందరికి కుమార్తెలు, కుమారులను కలిపి ఇచ్చేది ఆయనే. తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వనివాడు కూడా ఆయనే. ఆయన అనుమతి లేనిదే ఏ స్త్రీ గర్భం దాల్చదు, ఏ స్త్రీ ప్రసవించదు. తమ తొడిమల నుండి బయటకు వచ్చే ఫలాలన్నిటినీ ఎరిగినవాడు ఆయనే.

ఆయనే నవ్వించేవాడు, ఆయనే ఏడ్పించేవాడు. ఆయనే జీవితాన్ని ప్రసాదించేవాడు, ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు, ఆయనే అంతం, ఆయనే ఆరంభం. భూమి ఆకాశాలలో ఉన్న నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. ఆయనే ఉరుముల, మెరుపుల గర్జనను సృష్టించి భూమి మీద తన విషయంలో వివాదపడే వారిపైన పడవేసేవాడు.

ఆ కరుణామయుడే ఉత్పత్తి కారకములైన గాలులను పంపేవాడు. అవి మేఘాలను లేపుతాయి. తర్వాత ఆయన ఆ మేఘాలను తన ఇష్ట ప్రకారం, ఖండికలుగా విభజించి వాటి ద్వారా తాను కోరిన చోట వర్షాన్ని కురిపించి, తర్వాత ఆ నీటిని ఊటలు,చెలమలు, నదుల రూపంలో భూమిలో ప్రవేశింపజేసేవాడు. తద్వారా భూమిలో రకరకాల శ్రేష్ఠమైన పదార్థాలను మనకు, మన పశు పక్షాదులకు ఆహారంగా పండించేవాడు ఆయనే. ఒకవేళ మన బావులలోని నీరు భూమి లోపలకు ఇంకిపోతే ప్రవహించే ఆ నీటి ఊటను ఆయన తప్ప మరెవరూ బయటకు రప్పించలేరు.

మన జీవనోపాధి కోసం అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించడానికి వెలుగుతో కూడుకున్న పగటిని సృష్టించినవాడు ఆయనే. మనం నిద్ర ద్వారా విశ్రాంతిని పొందడానికి చీకటితో కమ్ముకున్న రాత్రిని సృష్టించినవాడూ ఆయనే. ఆయనే మన కొరకు నక్షత్రాలను ఎడారి చీకటిలో, సముద్ర చీకట్లలో మార్గాన్ని తెలుసుకునే సాధనంగా చేసినవాడు. సూర్యునికి వెలుగునూ, చంద్రునికి కాంతిని ఇచ్చినది ఆయనే. మనం సంవత్సరాలు, తేదీల లెక్క తెలుసుకోవాలని చంద్రుని పెరిగే తరిగే దశలను ఖచ్చితంగా నిర్ణయించిన వాడు ఆయనే. ఆయనే మనకోసం పచ్చని వృక్షాల నుండి అగ్నిని సృష్టించినవాడు. తమ రెక్కలను చాపుతూ, ముడుచుతూ ఎగిరే పక్షులను గాలిలో అలా నిలబెట్టినవాడు ఆయనే.

మనకు సంపదలు, సంతానమూ ఇచ్చి సహాయపడేది ఆయనే. ఆయన మహా శక్తిమంతుడు, మహా జ్ఞాని, పాపాలను క్షమించేవాడు, పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడూనూ, కఠినంగా శిక్షించేవాడు, ఘనంగా కరుణించే వాడూను.



IPC వార్తలు

# ఉమ్రా న్యూస్



ఇస్లాం ప్రజెంటేషన్ కమిటీ (IPC) ఆధ్వర్యంలో గత ఆగస్టు నెల 11-08-2007 తేదీ నుండి 15-08-2007 తేదీ వరకు 40 మందితో కూడిన ముత్తదీల బృందం ఉమ్రా యాత్ర చేసి వచ్చింది. **నెలవంక** అసోసియేట్ ఎడిటర్ మౌలానా ముజాహిద్‌ఖాన్ ఉమ్రీతో సహా పలువురు ఐపిసి ప్రబోధకులు ఈ పయన బృందానికి సారథ్యం వహించారు. కారున్య ప్రభువు వీరందరి ఉమ్రాను ఆమోదించుగాక !



**మీఖాత్ వద్ద ఇహ్రామ్ దీక్ష బూనిన తెలుగు సోదరులు.**



మస్జిదె హరామ్ ప్రాంగణంలో సన్మార్గ ధనులైన తెలుగు సోదరులతో ఐ.పి.సి ప్రబోధకులు మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ గారు.




**ఖుర్ఆన్ ప్రింటింగ్ కాంప్లెక్స్ కాంపౌండ్‌లో ఒక దృశ్యం**






**ఖుర్ఆన్ ప్రతులను దక్షిణగా పొందిన ఉమ్రా యాత్రికులు.**



**మదీనాలోని షాహ్ ఫహద్ ఖుర్ఆన్ ముద్రణాలయం లోని ఒక దృశ్యం.**

PAGE 16-17.pdf 10/7/07 9:10:10 PM



# దివ్య ఖుర్‌ఆన్ మానవత పాలిట మహాదానుగ్రహం

- మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్

**మా**నవాళికి విశ్వ ప్రభువు చేసిన మేళ్ళు అగణ్యమైనవి. ఆయన మనిషి జీవికకు అన్నపానీయాలొసగటమే గాక మనోభావాల్ని ప్రకటించే శక్తియుక్తులను కూడా ప్రసాదించాడు. జీవనోపాయాన్నిచ్చాడు. ఇంకా మనిషి సంస్కృతీ నాగరికతలకు దోహదపడే సామగ్రిని ధరిత్రిలో పుష్కలంగా పొందుపరిచాడు.

సృష్టికర్త ఇచ్చిన ఈ భౌతికానుగ్రహాలన్నీ ఒక ఎత్తయితే ఆధ్యాత్మికంగా మానవాళికి మార్గదర్శకత్వం వహించడం ఒక ఎత్తు.సర్వ విధాల మానవతపై దయదలచిన ప్రభువు సన్మార్గం



చూపే ఏర్పాటు కూడ చేయకుండా వదిలేస్తే అవనిలో శాంతి ఉండదు. అంతటా అల్లకల్లోలం ఏర్పడుతుంది. మంచి, మానవత్వం నీతి నియమం అన్నవేవి మిగలవు. మానవ సమాజాల్లో అపసవ్యత అధికమై మానవత అపమార్గం పట్టడాన్ని కారుణ్య ప్రభువు ఎంత మాత్రం ఇష్టపడడు. వాస్తవమేమిటంటే తన దాసులైన మానవులంటే ఆయనకు అమితమైన ప్రేమ. అందుకే అసంఖ్యాకమయిన తన వరాలను వారిపై కురిపించడంతోపాటు వారి ఇహపర సాఫల్యాల కోసం మార్గదర్శక ఏర్పాటు కూడా చేశాడాయన. ప్రవక్తల ద్వారా ఆయన సమస్త మనుజ జాతికి మార్గదర్శక నియమావళిని ప్రసాదించాడు. దైవ ప్రవక్తలందరికీ ఆయా కాలాలను, అవసరాలను బట్టి గ్రంథాలను, ప్రవర్తనా నియమావళుల (సహీఫా)ను పంపుతూ వచ్చాడు. వాటి ఆధారంగా ప్రవక్తలు మానవ సంస్కరణా కార్యానికి నడుం బిగించేవారు. ప్రజల జీవితాలను తీర్చిదిద్దేవారు. దైవ భీతి, పరలోక భావనల ప్రాతిపదికగా మానవ సమాజాల్లో నైతిక విప్లవం తెచ్చేవారు.

ఈ మార్గదర్శక గ్రంథాలలో చిట్ట చివరిది దివ్య ఖుర్‌ఆన్. ఖుర్‌ఆన్‌కు పూర్వం దైవ గ్రంథాలెన్నో అవతరించాయి. ఉదాహరణకు తౌరాతు, జబూర్, ఇంజీల్ (సువార్త)లు ఆకాశ గ్రంథాలే. కాని ఆ గ్రంథావలంబీకులు ప్రదర్శించిన అలసత్వం వల్లనైతేనేమీ, ఆ మతాధిపతులు తమ స్వప్రయోజనం కోసం చేసిన మార్పులు చేర్పుల వల్లనైతేనేమీ అవి తమ స్వచ్ఛతను, సిసలైన స్థితిని కోల్పోయాయి. దైవ ప్రోక్తంలో మానవ కల్పితాలు చోటు చేసుకున్న కారణంగా మానవత సహజంగానే పెడర్థాలకు పోయి పెడత్రోవలు పట్టేది. మానవత ఇలా అపమార్గానికి లోనయినప్పుడల్లా దేవుడు మరో ప్రవక్తను, మరో జీవన విధానాన్ని పంపి అది మరచిపోయిన పాఠాలను జ్ఞాపకం చేసే ఏర్పాటు చేసేవాడు. ఈ మార్గదర్శక పరంపరలో కట్ట కడపటి గ్రంథమే ఖుర్‌ఆన్.

దివ్య ఖుర్‌ఆన్ మానవాళి పాలిట ఓ మహదానుగ్రహం. ప్రపంచంలోని మరే అనుగ్రహమూ దీనితో సరితూగలేదు. మనిషి ఇహపర సాఫల్యాలు, సభ్యతా సంస్కారాలు, గౌరవోన్నతులు, నీతి నడవడికలు – అన్నీ ఈ ఉద్గ్రంథంతో ముడిపడి ఉన్నాయి. ఇటువంటి గ్రంథరాజం ప్రజలు మాట్లాడే భాషలన్నింటిలో అనువదించబడి ప్రాచుర్యంలోనికి రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఆవశ్యకతను వ్యకులు, సంస్థలు గుర్తించి శాయశక్తులా తమ వంతు కృషి చేస్తున్నారు కూడాను.

అయితే దివ్య ఖుర్‌ఆన్ ఓ మహా సాగరం. ఉలమాలు (పండితులు) ఈ గ్రంథాన్ని ఎంత శోధించినా వారి తనివి తీరదు. దాని లోతుల్లోకి పోయిన కొద్దీ విలువైన ముత్యాలు దొరుకుతూనే ఉంటాయి. కొంగ్రొత్త విషయాలు ముందుకు వస్తూనే ఉంటాయి. 20వ శతాబ్దిలో – ఉపఖండంలో – ఎన్నదగ్గ ఉలమాలెందరో ఖుర్‌ఆన్ పరిశీలనకై తమ జీవితాలను అంకితం చేసి ఉర్దూలో విలువైన వ్యాఖ్యానాలు వ్రాశారు. సరికొత్త కోణాల నుంచి విషయాలను చర్చించారు. అలాగే ఖుర్‌ఆన్ శిక్షణ, ఖుర్‌ఆన్ ఔన్నత్యం వంటి అంశాలపై కూడా పండితులు పరిశోధనలు చేసి వెలకట్టలేని గ్రంథాలను వెలువరిస్తున్నారు. నిస్సందేహంగా వీటి అధ్యయనం వలన పాఠకుల హృదయం జోతిర్మయమవడమేగాక ఖుర్‌ఆన్‌పై యోచన చేయాలన్న జిజ్ఞాస వారిలో పెంపొందుతుంది.

విజ్ఞానం పేరుతో నేడు గగన సీమల్లో స్వైర విహారం చేస్తున్న మనిషికి నేలపై నిలిచి సాటి మనుషులతో సహజీవనం చేయటం చేతకావటం లేదు. కమ్యూనికేషన్ల ప్రగతి వల్ల ప్రపంచ రాజ్యాల మధ్య దూరాలు తరిగిపోయి ప్రపంచం నానాటికీ ఒక్కటిగా కుంచించుకుపోతున్నా మనుషుల మనసులు మాత్రం ఒక్కటి కావటం లేదు. జాతి, రంగు పేరిట నేటికీ ప్రపంచంలో విద్వేషం పెరిగి రక్తం చిందుతూనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు ప్రపంచమంతా రోగగ్రస్తమై ఉంది. దానికి చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దివ్య ఖుర్‌ఆన్ ఒక దివ్య ఔషదం! అది సర్వ రోగ నివారిణి! అది మానవులందరికీ మార్గదర్శిని! హృదయ పూర్వకంగా హృదయానికి హత్తుకుని అనుసరించగోరే వారికి అది మోక్ష ప్రదాయిని.

అలాగే ముఖమంతా, నుదుటి నుండి గడ్డం వరకు, కుడి చెవి నుండి ఎడమ చెవి వరకు పరిశుభ్రంగా మూడుసార్లు కడుక్కోవాలి. కుడి చెయ్యి ఆ తరువాత ఎడమ చేతినీ, మూడుసార్లు మోచేతి దాకా తోమి కడుక్కోవాలి.

నుదుటి నుంచి తల మీదుగా, మెడ వెనక భాగం దాకా తడి చేతులతో తుడుచుకోవాలి. మంచి నీటిలో వేళ్ళు ముంచి (తడి వేళ్ళతో) చెవి వెనక, ముందు భాగాలని, లోపలి భాగాన్ని మూడు సార్లు శుభ్రపరచుకోవాలి. రెండుకాళ్ళనీ, పాదాలు మడిమలూ పూర్తిగా తడిసేటట్లు మూడుసార్లు కడుక్కోవాలి.

ఒక రోజుకి అయిదుసార్లు – ప్రార్థన చెయ్యవలసినప్పుడల్లా అయిదు సార్లూ – ఎన్ని విధాలుగా దేహాన్ని శుభ్రపరచుకోవాలో చూడండి.

ఈ పవిత్రమూర్తి – ఆత్మ పారిశుధ్యానికేగాక, దేహ పరిశుభ్రత గురించి కూడా, అమితమయిన – క్రమతతో కూడిన స్థిర అభిప్రాయాలకి పునాదులు వేశారు, ఆయన దగ్గిర పల్లు తోముకునే పుల్లలు (మిస్వాక్) ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి – వుజూ చేసినప్పుడల్లా పల్లు తోముకోవాలి !

ఎక్కడబడితే అక్కడ ఉమ్ములు వేసే మనుషులంటే ఆయన ఇష్టపడే వారు కాదు. ఎవరయినా పొరబాటున తెలియక ఉమ్మివేస్తే, ఆ స్థలాన్ని వెంటనే నీళ్ళతో కడిగేవారు.

తాను ఉండేటువంటి పరసర ప్రదేశాలని అద్దంలాగా, శుభ్రంగా తళ తళ మెరిసేటట్లు ఉంచుకునేవారు. చినిగిపోయిన పాత బట్టలు వాటికి అతుకులు వేసి ధరించినా అవి శుచీశుభ్రతలతో తళతళమని మెరుస్తూ ఉండేవి.

"పరిశుభ్రత అన్నది 'ఈమాన్' (విశ్వాసం, ఆచరణ) లో సగభాగం" అన్నది ప్రవక్తాధినేత సుభాషితం.

మరణించిన వ్యక్తిని – సమాధి చెయ్యబడే చోటు శుభ్రంగా శుచిగా ఉండాలన్నది కూడా వారి ప్రవచనమే.

**(ఈ వ్యాసం Tip వారి "నేను ఆరాధించే ఇస్లాం" నుండి తీసుకోబడింది.)**

## త్వరలో !

- నికార్సయిన శీలవంతుడతను!
- తనను నమ్మిన స్వామికి ఏ దశలోనూ స్వామి ద్రోహం తలపెట్టని నిజాయితీపరుడతను!

అంతేకాదు -

- ప్రజల జీవితాలను తీర్చిదిద్దాలని అహరహం ఉవ్విళ్ళూరే గొప్ప సంస్కర్త!
- తన రాజ్యానికి పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టిన తక్షణమే రాజ్యాధికారిని జాగరూక పరచిన శ్రేయోభిలాషి!
- దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించే తరుణోపాయాన్ని ప్రతిపాదించిన గొప్ప ఆర్థికవేత్త!
- దేశానికి తన అవసరం ఉందని చెప్పగానే నిస్వార్థ సేవలందించడానికి ఏ మాత్రం తటపటాయించని బహుముఖ ప్రజ్ఞాశీలి!

### ఎవరతను?

నెలవంకలో రానున్న ధారావాహిక అత్యుత్తమ యదార్థ గాథకై ఎదురు చూడండి.



# పరిశుభ్రతకు మరో పేరు ఇస్లాం

తమిళ మూలం

అడియార్

తెలుగు రూపం

శ్రీమతి మాలతీ చందూర్

ముస్లిమ్‌ల ఆచార వ్యవహారముల గురించీ, వారు అనుసరిస్తున్న నిత్య జీవిత విధానం ఎటువంటిది అన్నదాన్ని గురించి తెలియని వారికి కొన్ని విషయాలు చెపుతాను.

ఇస్లామ్ మార్గం పరిశుభ్రతని ఉపదేశించిన మార్గం. మహాప్రవక్త వలె వ్యక్తి శుభ్రత, పరిసర శుభ్రత, నగర శుభ్రత, ఆచరణలోపెట్టి జీవించి నట్లయితే ఈ ప్రపంచమే నిర్మలమయిన పారిశుధ్యానికి నిలయమయిన ఒక సుందర లోకమవుతుంది.

ఆ మార్గం రోజుకి అయిదుసార్లు ప్రార్థన చెయ్యవలెనని నిర్దేశించింది. ప్రార్థన చెయ్యటానికి ముందు.....శుచీ శుభ్రతలు అత్యంత ముఖ్యమయినవి. అవసరమయినవి అని ఈ మార్గం పదే పదే నొక్కి చెప్పింది.

పరిశుభ్రతని – 'తహారత్' అని అంటారు. ఈ శుచీ – శుభ్రతలు మూడు విధాలుగా ఉండాలి.

(1) దేహ పరిశుభ్రత.
(2) దుస్తుల పరిశుభ్రత.
(3) పరిసరాల పరిశుభ్రత.

మలమూత్ర విసర్జన అనంతరం దేహాన్ని అతి శుభ్రంగా కడుక్కోవాలి. మూత్ర విసర్జన తరువాత 'ఢేలా' (మట్టిపెళ్ళ) ను ఉపయోగించాలి. ఆ తరువాత మంచినీళ్ళతో పరిశుభ్రంగా కడగాలి.

మల మూత్ర విసర్జనలు చెయ్యకూడని స్థలాలు :

(1) మనుషులు తిరిగేటటువంటి రహదార్లలో.
(2) నదీ ప్రవాహపు ఒడ్డున.
(3) ఆహార పదార్థాలు పండించే పొలాల్లో.
(4) చెట్ల మొదళ్ళలో.
(5) ఈద్‌గాహ్ – (పండుగ నమాజ్ చేసే స్థలం) మస్జిద్, కబ్రస్తాన్ (గోరీల వాటిక) ఇత్యాది స్థలాలు.

ఇవేగాక చెయ్యకూడని పనులు ఏమిటి – అన్నది కూడా – స్పష్టంగా తెలియజెయ్యబడింది.

నుల్చుని మూత్ర విసర్జన చెయ్యకూడదు. నీటి ప్రవాహాన్ని, త్రాగే నీటిని మూత్ర విసర్జనతో కలుషితం చెయ్యరాదు.

కుక్క, పంది వంటి జంతువుల ఎంగిలి తగిలితే లేక అది వంటి మీద పడితే, బాగా కడిగి శుభ్రపరచుకోవాలి.

జంతువుల పెంట, మూత్రం, చీమూ, రక్తం వంటివి వంటి మీదనో, బట్టల మీదనో పడితే వాటి మచ్చలు పోయేవరకూ కడిగి శుభ్రపరచు కోవాలి.

పసి పిల్లలు మూత్రం పోసుకున్నా కూడా శుభ్రంగా నీటితో కడిగి తుడవాలి.

ప్రార్థనకి వెళ్ళబోయేవారి ప్రథమమయిన ధర్మం (స్నానం) గుసుల్. రెండో విధి ' వుజూ ' – కాళ్ళూ చేతులూ శుభ్రం చేసుకోవటం.



## గుసుల్ (స్నానం)

స్నానం లేక వంటి మీద నీళ్ళు పోసుకోవటం అనబడు ఈ గుసుల్ విధానాలు :

- నోటినిండా నీళ్ళు పోసుకు పుక్కిలించటం.
- ముక్కు లోపలికి నీరు పీల్చి పరిశుభ్రపరచుకోవడం.
- దేహమంతా పూర్తిగా శుభ్రపడునట్లు నీళ్ళతో స్నానం చేయడం.

స్నానం చేస్తున్నపుడు దేహంలో వెంట్రుకవాసి కూడా తడవని పొడి ప్రదేశం ఉండకూడదు. అట్లా ఏ కాస్త పొడి స్థలం దేహం మీద ఉన్నా 'గుసుల్' నెరవేరలేదని అర్థం.

దీని తరువాత 'వుజూ' అనేటువంటి కాళ్ళూ చేతులూ శుభ్రపరచు కునే విధానం చూద్దాం.

రెండు చేతులనీ మణికట్టుదాకా మూడుసార్లు కడుక్కోవాలి. పల్లు శుభ్రంగా తోముకుని – మూడుసార్లు నీటితో పుక్కిలించి కడుక్కోవాలి. నోరులాగానే ముక్కుని నీళ్ళతో కడిగి, చీది, ముక్కు రంధ్రాలలో మాలిన్యం లేకుండా శుభ్రపరచుకోవాలి.

# నీటిని ఆదా చేయటమెలా?



మీ తోటలకు, వృక్షాలకు నీటిని సరఫరా
చేసే సమయంలో నేరుగా పైపులను వాడకండి.
దీనికోసం బక్కెట్లను ఉపయోగిస్తే చాలావరకు
నీరు ఆదా అవుతుంది.



నేరుగా పైపును ఉపయోగించి కారు కడగటం
వల్ల 300 లీటర్ల నీరు
ఖర్చవుతుందన్న సంగతి మీకు తెలుసా?
అందుకే కారును కడిగేటప్పుడు బక్కెట్లను గానీ,
మరేదైనా పాత్రనుగానీ ఉపయోగించండి.




బ్రష్ చేసుకునేటప్పుడుగానీ, గడ్డం చేసుకునేటప్పుడుగానీ,
అంట్లు తోమే సమయంలోగానీ, వేడి నీళ్ళ నిరీక్షణలోగానీ
అనవసరంగా కొళాయిని తెరచి ఉంచకండి. మీ పని అయిన వెంటనే
కొళాయిని సరిగ్గా బిగించి కట్టండి. ఉపయోగించిన నీరు
ఇతరత్రా పనులకోసం వాడటానికి వీలుగా ఉంటే వాడండి.



కొళాయి నుంచి కారే ఒక్కొక్క నీటి చుక్క వల్ల ఎంతో
నీరు వృధా కావచ్చు. ఒక వేళ ఒక కొళాయి నుంచి రోజంతా
ఒక్కో డ్రాప్ చొప్పున క్రింద పడుతుంటే రమారమి 27 లీటర్ల
నీరు వృధా అయినట్లే.

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
رحمة للعالمين ...
2444117
www.thelastingmiracle.com




IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
... رحمة للعالمين
Ext. 110 2444117
www.thelastingmiracle.com

TELUGU BOOKS

# ఇంకా ...

వివిధ అంశాలపై ఎన్నో విలువైన కేసెట్లు, ఫోల్డర్లు ఉచితంగా సరఫరా చేయబడతాయి.




కువైట్ సిటీలోని ఐపిసి హెడ్డాఫీసులతో పాటు,
బ్రాంచ్ ఆఫీసులను కూడా సంప్రదించండి.

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE

رحمة للعالمين...

Ext. 106 **2444117**

www.thelastingmiracle.com